
# విశాల భారతి

4-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 90

## ముందు మూసీని శుభ్రం చేయండి

- ఆలయాల కంటే మూసీ ప్రక్షాళనకే తొలి ప్రాధాన్యత
- కాలుష్య నదిలో శివ విగ్రహం ఏర్పాటు చేయడం అనుచితం
- గతంలో ఖర్చు చేసిన కోట్లాది రూపాయలు వృథా
- పరిశ్రమల వ్యర్థాలతో నది నీరు పూర్తిగా విషతుల్యం
- కబ్జాల వల్ల నది కాస్తా మురుగు కాలువలా మారింది
- ముందుగా నదిని క్లీన్ చేశాకే ఇతర పనులు చేపట్టాలి

03

# పేదల ఇళ్లను కూలుస్తూ మాపై విమర్శలా?



### కేరళ సీఎం విజయన్, మోదీ ఒక్కటేనంటూ రేవంత్ సంచలన ఆరోపణ

- కేరళను విమర్శించే ముందు మీ పాలన చూసుకో అని చురక
- పేదల ఇళ్లను కూలుస్తూ మాపై విమర్శలా అని విజయన్ ప్రశ్న
- ప్రకటనలకు కోట్లు తగలేయకుండా అభివృద్ధిపై పెట్టాలని సూచన
- దేశంలోనే అత్యల్ప పేదరికం మాదేనని విజయన్ ధీమా
- మీ అధికారులే మా దగ్గరకు వచ్చి నేర్చుకుంటున్నారని ఎద్దేవా
- పెన్షన్లు సకాలంలో ఇవ్వలేని వారు మాకు సలహాలా అని విమర్శ
- సంక్షేమం, విద్యలో కేరళే దేశానికి ఆదర్శమని విజయన్ వెల్లడి
- అనవసర రాజకీయ ఆరోపణలు మానుకోవాలని రేవంత్‌కు హితవు
- పాలన ఎలా ఉండాలో నేర్చుకోవాలంటే కేరళ రావాలని ఆహ్వానం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రేవంత్ రెడ్డి చేసిన ఘాటు విమర్శలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అంతే దీటుగా స్పందించారు. వేరే రాష్ట్రాల పాలన గురించి మాట్లాడే ముందు రేవంత్ రెడ్డి తన సొంత రాష్ట్రంలోని పరిస్థితులను చక్కదిద్దుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్న తీరును పినరయి ఎండగట్టారు. పేదల గూడును చెడగొడుతూ మానవత్వం లేని పాలన సాగిస్తున్న వారు కేరళపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అనవసరమైన రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేయడం సరికాదని సూచించారు. కేరళ రాష్ట్రంలో పేదరికం కేవలం 0.55 శాతం మాత్రమే ఉందని, ఇది దేశంలోనే అత్యల్పమని పినరయి విజయన్ గణాంకాలతో వివరించారు. సంక్షేమం, ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాల్లో కేరళ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని గర్వంగా ప్రకటించారు. ఇతర రాష్ట్రాలు అనుసరించాల్సిన స్థాయికి కేరళ అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వ పథకాలు నేరుగా అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయని, అందుకే ప్రజలు తమను ఆదరిస్తున్నారని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తన విమర్శలను మానుకొని కేరళలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అధ్యయనం చేస్తే మంచిదని చురకలు అంటించారు. తెలంగాణ ప్రభుత్వం రాజకీయ ప్రకటనల కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందని పినరయి విజయన్ ఆరోపించారు. కేవలం ప్రచారం కోసమే పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసే బదులు, ఆ నిధులను రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని హితవు పలికారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే

మిగతా 2లో..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేరళ రాష్ట్రంలో పర్యటించి అక్కడి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పినరయి విజయన్, ప్రధాని మోదీ ఇద్దరూ ఒక్కటేనంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. కేరళలో అవినీతి పెరిగిపోయిందని, పాలన అస్తవ్యస్తంగా మారిందంటూ రేవంత్ చేసిన ఆరోపణలు వామపక్ష వర్గాల్లో ఆగ్రహాన్ని కలిగించాయి. పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చి తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కేరళ అధికార యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది.



## టెక్స్‌టైల్స్ హబ్‌గా తెలంగాణ

- 2047 నాటికి ఆసియాలోనే నంబర్ వన్ లక్ష్యం
- మన పత్తి పారిస్, దుబాయ్ ఫ్యాషన్ షోలకు
- హాలీవుడ్ కూడా హైదరాబాద్‌కే వస్తోంది
- అత్యాధునిక టూల్స్‌తో శిక్షణ, ఉపాధి
- పర్యావరణ హితమైన హబ్‌ల ఏర్పాటు
- వేగంగా అనుమతులు, భూమి, విద్యుత్ సరఫరా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరిగిన 13వ ఏషియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ 2026 సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులను కేవలం అతిథులుగా మాత్రమే చూడటం లేదని, వారు తెలంగాణ అభ్యున్నతిలో కీలకమైన భాగస్వాములని ఆయన అభివర్ణించారు. మన రాష్ట్ర విజన్‌ను పంచుకునే ఆత్మీయ మిత్రులుగా వారిని గౌరవిస్తూ, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో వారందరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. ఈ అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యాన్ని వివరిస్తూనే, భవిష్యత్తుపై తనకున్న స్పష్టమైన లక్ష్యాలను వివరించారు. తెలంగాణ అస్తిత్వంలోనే వస్త్ర పరిశ్రమ పెనవేసుకుపోయిందని, మన డీఎన్ఏలోనే టెక్స్‌టైల్ రంగం దాగి ఉందని సీఎం ఈ సందర్భంగా గర్వంగా ప్రకటించారు. నిజాం పరిపాలన కాలం నుంచే హైదరాబాద్ నగరం అంతర్జాతీయ వాణిజ్యానికి నిలయంగా ఉండేదని ఆయన గుర్తు చేశారు. ఆ రోజుల్లోనే ప్రపంచంలోని వివిధ మూలల నుండి వ్యాపారులు ఇక్కడికి తరలివచ్చి వస్త్రాలు, అత్యంత విలువైన ముత్యాలను కొనుగోలు చేసేవారని చారిత్రక అంశాలను ప్రస్తావించారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న తెలంగాణ, నేడు వస్త్రోత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా నిలవడం మనందరికీ గర్వకారణమని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర సంప్రదాయాల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ, శ్రీ రామనవమి పర్వదినం వేళ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి పట్టు వస్త్రాలు సమర్పించడం

మిగతా 3లో..



## రేవంత్‌ని ఓడించే పార్టీలో చేరతా

- రేవంత్‌ను ఓడించే పార్టీలోనే చేరతానని ప్రకటన
- రెండేళ్లలోనే ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి
- ఇచ్చిన వాగ్దానాలు, ప్రాజెక్టుల పునర్నిర్మాణంపై విమర్శలు
- త్వరలోనే పార్టీ మారడం ఖాయమన్న జీవన్ రెడ్డి
- ఈ నెల 13న కారెక్కనున్నట్లు సమాచారం
- ఏప్రిల్ 7న జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ

03

## పశ్చిమాసియాలో రణక్షేత్రం

- ఇరాన్ భూభాగంలో అమెరికా F-35 యుద్ధ విమానం కూల్చివేత
- పారాచూట్ ద్వారా కిందకు దిగిన అమెరికా పైలట్ ఇరాన్ వశం
- టెహ్రాన్ సమీపంలోని కీలక వంతెనపై అమెరికా వైమానిక దాడి
- ఇరాన్ ఆయుధ రవాణా ఆపడమే లక్ష్యమని అమెరికా ప్రకటన

02



## కాంగ్రెస్ గ్యారంటీలు ఎక్కడ?

- కేరళ ప్రచారంలో రేవంత్ అసత్య ఆరోపణలు
- తెలంగాణలో ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?
- పాత సర్కార్ లాగే రేవంత్ ప్రజలను వంచిస్తున్నారు
- బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్
- రాష్ట్రంలో హామీలు నెరవేర్చకుండా గొప్పలు వద్దు
- అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేరళ అసెంబ్లీ ఎన్నికల సమరంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న ప్రచార పర్వం ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ సెగలు పుట్టిస్తోంది. పొరుగు రాష్ట్రంలో కాలుమోపిన రేవంత్ రెడ్డి, అక్కడ భారతీయ జనతా పార్టీపై చేస్తున్న విమర్శలు కమలం

మిగతా 2లో..





## పౌర సరఫరాల విభాగం నిద్రపోతుందా?

- ఆయిల్ కంపెనీలు బంకులకు అప్పు ఆపేశాయి
- ఈ-కేవైసీ పేరుతో సిలిండర్ల పంపిణీలో జాప్యం
- పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ లేకపోవడం
- డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి పట్టడం
- ఏపీలో గ్యాస్ కోటాను 70శాతం పెంచిన కేంద్రం

04



## హనుమాన్ శోభాయాత్ర ఘన విజయం

- 550కి పైగా బైక్‌లతో భారీ ర్యాలీ ప్రముఖ నేతల పాల్గొనిక
- ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

07

## కేరళలో రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

- హామీలు అమలు చేయకుండా కేరళలో ప్రచారం
- ఆరు గ్యారంటీల అమలు అస్తవ్యస్తంగా ఉంది
- 2 లక్షల ఉద్యోగాలకు బదులు 16 వేలే ఇచ్చారు
- ఎస్టీ కార్పొరేషన్ నిధులు ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం
- లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకుండా మోసం
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ కేవలం మాటలకే పరిమితం

03



# వాట్సాప్‌లో 'లంచాల' రేట్లు

- డాక్యుమెంట్ల వారీగా వాట్సాప్ చాటింగ్‌లో బేరసారాలు
- ఏడాదిలో రూ. 42 లక్షల అక్రమ లావాదేవీల గుర్తింపు
- 20 మంది ఏజెంట్లు, నగదు, డాక్యుమెంట్ల సీజ్
- సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో రూ. 26.6 లక్షల నగదు లభ్యం
- 819 గ్రాముల బంగారం, 2.6 కిలోల వెండి స్వాధీనం
- కపిల్ చిట్‌సేలో రూ. 30 లక్షల ఎఫ్‌డీల గుర్తింపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హనుమకొండ జిల్లాలోని వడ్డెపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందన్న ఆరోపణలు నిజమేనని నిరూపిస్తూ ఏసీబీ అధికారులు చేపట్టిన మెరుపు దాడులు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించాయి. సామాన్య ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న అక్రమ సంపాదన లెక్కలు చూసి స్వయంగా అధికారులే విస్తుపోయారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత లోపించడమే కాకుండా ప్రతి పనికీ ఒక ధర నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు దాడుల్లో స్పష్టమైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన క్రయ విక్రయాల ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్లు తమ సొంత లాభం కోసం ఒక వ్యాపారంగా మార్చుకున్న తీరు విచారణలో బయటపడింది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తిష్టవేసిన అవినీతి తిమింగలాల గుట్టు రట్టు చేసేందుకు ఏసీబీ బృందం పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగింది. గురువారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన ఈ సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగి అనేక అక్రమాలను వెలుగులోకి తెచ్చాయి. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించడమే కాకుండా అక్కడ పనిచేస్తున్న అధికారుల వ్యక్తిగత ఫోన్లను నిశితంగా తనిఖీ చేయడంతో అక్రమ దందాల చిట్టా బయటపడింది.

మిగతా 2లో..



# పశ్చిమాసియాలో రణక్షేత్రం

- ఇరాన్ భూభాగంలో అమెరికా F-35 యుద్ధ విమానం కూల్చివేత
- పారాచూట్ ద్వారా కిందకు దిగిన అమెరికా పైలట్ ఇరాన్ వశం
- టెహ్రాన్ సమీపంలోని కీలక వంతెనపై అమెరికా వైమానిక దాడి
- ఇరాన్ ఆయుధ రవాణా ఆపడమే లక్ష్యమని అమెరికా ప్రకటన
- గల్లంతైన సిబ్బంది కోసం అమెరికా సైన్యం సెర్చ్ ఆపరేషన్
- ఇరాన్ గడ్డపై అమెరికా విమానం కూలడం ఇదే తొలిసారి

**విశాలభారతి, అంతర్జాతీయం:**



పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు అత్యంత ప్రమాదకరమైన మలుపు తీసుకున్నాయి. ఇరాన్ భూభాగంలో అమెరికాకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాన్ని లక్ష్యంగా చేసుకుని కూల్చివేసినట్లు వెలువడుతున్న సమాచారం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన చోటుచేసుకున్న వెంటనే అప్రమత్తమైన అమెరికా సైన్యం గల్లంతైన తమ పైలట్లు, సిబ్బందిని రక్షించేందుకు భారీ ఎత్తున గాలింపు చర్యలను చేపట్టింది. ప్రస్తుత యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇరాన్ గగనతలంలో అమెరికా యుద్ధ విమానం కూలిపోవడం ఇదే తొలిసారి కావడంతో అగ్రరాజ్యం ఈ విషయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ చోటుచేసుకున్న ఈ పరిణామం ఇరు దేశాల మధ్య నేరుగా యుద్ధానికి దారితీసేలా కనిపిస్తోంది. తమ రివల్యూషనరీ గార్డ్స్ బలగాలు రెండు అమెరికా యుద్ధ విమానాలను విజయవంతంగా కూల్చివేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా వర్గాలు ధృవీకరిస్తున్నాయి. నైరుతి ఇరాన్ ప్రాంతంలో విమానం నుంచి పారాచూట్ ద్వారా సురక్షితంగా కిందకు దిగిన ఒక అమెరికా పైలట్‌ను తమ సైన్యం బందీగా పట్టుకున్నట్లు ఇరాన్ పేర్కొంటోంది. శత్రు దేశానికి చెందిన కీలక వ్యక్తి తమ ఆధీనంలో ఉండటం యుద్ధ తంత్రంలో భాగంగా ఇరాన్‌కు కలిసివచ్చే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఇరాన్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, అమెరికా రక్షణ శాఖ మాత్రం ఆపరేషన్ కొనసాగుతోందనే సమాచారంతో సరిపెట్టింది. పైలట్ క్షేమంపై వాషింగ్టన్ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపానికి దక్షిణ దిశలో ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ అభివృద్ధి చేసిన కొత్త వాయు రక్షణ వ్యవస్థను పరీక్షించినట్లు తెలుస్తోంది. ఈ అధునాతన వ్యవస్థ ద్వారానే అమెరికాకు చెందిన అజేయమైన ఎఫ్35 విమానాన్ని కూల్చివేశారని ఇరాన్ ఖతమ్ అల్‌అన్బియా ప్రధాన కార్యాలయ ప్రతినిధి వెల్లడించారు. సాంకేతిక పరంగా ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా భావించే ఎఫ్35 విమానం కూలిపోవడం రక్షణ రంగ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కూలిపోయిన విమానం నుంచి పైలట్ సురక్షితంగా బయటకు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఇరాన్ సైనిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ దాడి ద్వారా తమ రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని ఇరాన్ ప్రగల్భాలు పలుకుతోంది. మరోవైపు ఇరాన్ రాజధాని టెహ్రాన్ సమీపంలో కూడా రెండో అమెరికా ఎఫ్35 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ మెహర్ న్యూస్ ఏజెన్సీ వార్తా కథనాలను ప్రసారం చేసింది. వరుసగా రెండు భారీ విమానాలను కోల్పోవడం అమెరికా వాయుసేనకు కోలుకోలేని దెబ్బగా పరిగణించవచ్చు. అయితే అమెరికా ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం ఒక ప్రమాదం జరిగినట్లు మాత్రమే అధికారికంగా అంగీకరించింది. ప్రస్తుతానికి రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోందని, విమానం రకానికి సంబంధించిన వివరాలను ఇంకా నిర్ధారించాల్సి ఉందని స్పష్టం చేసింది. యుద్ధ విమానాల కూల్చివేత వార్తలు ప్రపంచ స్టాక్ మార్కెట్లపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. శత్రు దేశ పైలట్‌ను సజీవంగా పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించిన వారికి భారీ బహుమతులు అందజేస్తామని ఇరాన్ ప్రభుత్వం ఆ దేశ పౌరులకు హామీ ఇచ్చింది. అడవుల్లో లేదా కొండ ప్రాంతాల్లో ఎక్కడైనా పైలట్లు తలదాచుకుంటే వారిని పట్టుకోవడానికి స్థానిక ప్రజల సహాయాన్ని ఇరాన్ సైన్యం కోరుతోంది. ఆ ప్రాంతంలో అమెరికా విమానాలు తక్కువ ఎత్తులో ఎగురుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారమవుతున్నాయి. ఈ వీడియోలు యుద్ధం యొక్క తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఒకవేళ పైలట్లు బందీలుగా చిక్కితే అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం వారిని ఎలా చూస్తారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అమెరికా తన పౌరుల రక్షణ కోసం ఎంతటి సాహసానికైనా వెనకాడదని చరిత్ర చెబుతోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను పొరుగునే ఉన్న కరాజ్ నగరంతో కలిపే కీలకమైన బీ1 వంతెనపై తమ సైన్యం వైమానిక దాడి చేసినట్లు అమెరికా అధికారులు ధృవీకరించారు. ఇరాన్ నుంచి ఇతర ప్రాంతాలకు జరుగుతున్న ఆయుధ రవాణాను అడ్డుకోవడమే ఈ దాడి ప్రధాన లక్ష్యమని వాషింగ్టన్ ప్రకటించింది. వ్యూహాత్మకమైన ఈ వంతెనను ధ్వంసం చేయడం ద్వారా ఇరాన్ అంతర్గత రవాణా వ్యవస్థను దెబ్బతీయాలని అమెరికా భావిస్తోంది. ఈ దాడికి ప్రతిచర్యగానే ఇరాన్ తన గగనతల రక్షణ వ్యవస్థను ప్రయోగించినట్లు తెలుస్తోంది. వంతెన విధ్వంసం వల్ల ఆ ప్రాంతంలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. అగ్రరాజ్యం నేరుగా ఇరాన్ ప్రధాన భూభాగంపై బాంబుల వర్షం కురిపించడం ఉద్రిక్తతలను పరాకాష్టకు చేర్చింది.

పశ్చిమాసియా గందరగోళంలో ఉన్నప్పటికీ ఒక ఆసక్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్, అమెరికాలతో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ మూసివేసిన హోర్ముజ్ జలసంధి గుండా ఒక నౌక ప్రయాణించింది. ఫ్రాన్స్‌కు చెందిన భారీ సరుకు రవాణా నౌక ఎటువంటి ఆటంకం లేకుండా సురక్షితంగా ఈ మార్గం గుండా వెళ్లడం గమనార్హం. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన ఈ జలసంధిలో రాకపోకలు సాగడం అంటే.. కొన్ని దేశాలకు ఇరాన్ మినహాయింపు ఇస్తోందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు దెబ్బతింటున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. సముద్ర మార్గంలో కూడా యుద్ధ మేఘాలు అలుముకున్న వేళ ఈ ప్రయాణం సాహసోపేతమైనదే. యుద్ధ విమానాల కూల్చివేతతో పశ్చిమాసియాలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఇరాన్ తన శక్తిని ప్రదర్శించే క్రమంలో అగ్రరాజ్యాన్ని రెచ్చగొడుతుంటే, అమెరికా తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి సిద్ధమవుతోంది. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. ఇతర అరబ్ దేశాలు కూడా ఈ వివాదంలో చిక్కుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరాన్ మిత్రదేశాలు కూడా తమ సైన్యాన్ని అప్రమత్తం చేయడంతో గ్లోబల్ వార్ మొదలవుతుందా అనే భయం నెలకొంది. టెహ్రాన్ వీధుల్లో సైనిక కవాతులు, విమానాల హోరుతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రక్షణ రంగ నిపుణుల విశ్లేషణ ప్రకారం ఎఫ్35 వంటి విమానాన్ని కూల్చడం అంత సులభం కాదు. ఇందులో అత్యంత రహస్యమైన 'స్టీల్త్' సాంకేతికత ఉంటుంది, ఇది శత్రువుల రాడార్లకు చిక్కదు. మరి ఇరాన్ ఏ రకమైన టెక్నాలజీని వాడిందనేది ఇప్పుడు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలకు పెద్ద సవాలుగా మారింది. రష్యా లేదా చైనా నుంచి ఇరాన్‌కు రహస్యంగా అందే సాంకేతిక సహకారం వల్ల ఇది సాధ్యమై ఉండవచ్చని కొన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విమాన శకలాలను సేకరించడం ద్వారా అసలు నిజాన్ని తెలుసుకోవాలని అమెరికా ప్రయత్నిస్తోంది. మరోవైపు తమ భూభాగంలో పడిన శకలాలను ఇరాన్ స్వాధీనం చేసుకుని ఆ సాంకేతికతను కాపీ చేసే ప్రమాదం కూడా ఉంది. బందీగా చిక్కిన పైలట్ విషయంలో అమెరికా దౌత్యపరమైన ఒత్తిడిని పెంచుతోంది. అంతర్జాతీయ యుద్ధ ఖైదీల నిబంధనలను పాటించాలని హెచ్చరిస్తోంది. ఇరాన్ మాత్రం తన దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించినందుకు శిక్ష తప్పదని వాదిస్తోంది. ఈ వివాదం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చర్చకు రానుంది. మధ్యవర్తిత్వం వహించడానికి కొన్ని తటస్థ దేశాలు ముందుకు వస్తున్నా ఇరు దేశాలూ మొండిగానే వ్యవహరిస్తున్నాయి. పశ్చిమాసియా శాంతి ఇప్పుడు ఊగిసలాటలో ఉంది. రానున్న 24 గంటలు ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. క్షిపణుల గర్జనలు, విమానాల కూతలతో ఆకాశం ఎర్రగా మారుతోంది.

# కాంగ్రెస్ గ్యారంటీలు ఎక్కడ?

**మొదటిపేజీ తరువాయి**



పార్టీకి ఆగ్రహం తెప్పించాయి. ముఖ్యంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ వ్యవహారంపై అత్యంత కటువుగా స్పందించారు. కేరళ గడ్డపై నిలబడి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలన్నీ కేవలం బురదజల్లే ప్రయత్నాలని ఆయన కొట్టిపారేశారు. రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలను వండివార్చడంలో కాంగ్రెస్ నాయకత్వం సిద్ధహస్తురాలని, దానికి రేవంత్ రెడ్డి తాజా ఉదాహరణ అని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో అధికార పీఠం దక్కించుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ గుప్పించిన ఆరు గ్యారంటీల హామీలు ఇప్పుడు ఏ గాలిలో కలిశాయో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు హామీల అమలు కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుంటే, ముఖ్యమంత్రి మాత్రం అవేమీ పట్టనట్లు కేరళలో విన్యాసాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలకు వెళ్లి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాల గురించి రేవంత్ చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు అస్సలు పొంతన లేదని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్ల కాలంలో తెలంగాణను పాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరించిన పంథానే ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా తలకెత్తుకున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఏ విధంగానైతే ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చి ప్రజలను వంచించారో, రేవంత్ కూడా అదే బాటలో పయనిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలని, ప్రజలను తప్పుదోవ పట్టించడంలో ఈ రెండు పార్టీలకు మించిన వారు లేరని మండిపడ్డారు. తెలంగాణ గడ్డపై ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, కేరళ ఓటర్లను ఆకట్టుకోవడానికి అబద్ధాల కోటలు నిర్మిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గాల సంక్షేమం గురించి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీజేపీ వెనుకబడిన తరగతులకు అన్యాయం చేస్తోందంటూ రేవంత్ చేసిన విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ, బీసీల అభివృద్ధికి చేసిందేమిటో రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే బీసీ జపాన్ని రేవంత్ రెడ్డి అందుకున్నారని విమర్శించారు. బీజేపీ హయాంలోనే బీసీలకు అసలైన గుర్తింపు, గౌరవం లభించాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు రాజకీయ విలువలకు తిలోదకాలు ఇచ్చేలా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సొంత రాష్ట్రంలో రైతులు రుణమాఫీ కోసం రోడ్డెక్కుతుంటే, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆందోళనలు చేస్తుంటే, ఆ సమస్యలను పరిష్కరించడం చేతగాని ముఖ్యమంత్రికి కేరళలో ప్రచారం చేసే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. అక్కడ ఉన్న ప్రజలు కూడా రేవంత్ మాటలను నమ్మే స్థితిలో లేరని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల చరిత్ర అందరికీ తెలుసని పేర్కొన్నారు. అబద్ధాలతో ఎక్కువ కాలం రాజకీయం చేయలేరని, ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో పాలన గాలికి వదిలేసి, ఇతర రాష్ట్రాల్లో పార్టీ ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నెరవేర్చకుండా కేరళలో బీజేపీపై విషం చిమ్మడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నా, పథకాలకు నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం, కేరళలో మాత్రం సంక్షేమ రాజ్యంగా తాము తెలంగాణను తీర్చిదిద్దుతున్నట్లు భ్రమలు కల్పిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటల్లో చిత్తశుద్ధి లేదని, కేవలం అగ్ర నాయకత్వాన్ని మెప్పించడానికే ఆయన ఇలాంటి పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర అంతా అరాచకాలు, అబద్ధాలమయమని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి ఇప్పుడు బీజేపీని టార్గెట్ చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో అమలు చేయని గ్యారంటీలను కేరళలో అమలు చేసినట్లు ప్రచారం చేయడం ఆ రాష్ట్ర ప్రజలను అవమానించడమే అవుతుందని అన్నారు. ఎన్నికల వ్యూహకర్తలు రాసిచ్చిన స్క్రిప్టును రేవంత్ రెడ్డి అక్కడ చదువుతున్నారని, అందులో సత్యం మచ్చుకైనా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. కేరళ ప్రజలు విజ్ఞులని, వారు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే రేవంత్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలను పక్కనపెట్టి ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో తలదూర్చడం వల్ల తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల్లో ప్రచారం చేయడానికి వెళ్లే ముందు తెలంగాణలో తాము ఇచ్చిన హామీలను నెరవేర్చామో లేదో రేవంత్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. అబద్ధాల పునాదుల మీద కట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కాలం నిలవదని, ప్రజలు తమ హక్కుల కోసం పోరాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కేరళలో రేవంత్ చేసే ప్రతి ఆరోపణకు బీజేపీ తగిన రీతిలో సమాధానం చెబుతుందని, వాస్తవాలను అక్కడి ప్రజల ముందు ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కిన రేవంత్ రెడ్డికి, కేరళలో నీతులు చెప్పే అర్హత లేదని కిషన్ రెడ్డి కడిగిపారేశారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరుతాయని హామీ ఇచ్చి, ఇప్పుడు బడ్జెట్ లేదంటూ సాకులు చెప్పడం కాంగ్రెస్ నైజమని విమర్శించారు. కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని తెలిసి, రేవంత్ వంటి నేతలను పంపి అక్కడి ప్రజలను బురిడీ కొట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ ఎప్పుడూ అభివృద్ధి ఎజెండాతోనే ముందుకు వెళ్తుందని, కాంగ్రెస్ లాగా కులమతాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు చేయదని ఆయన పేర్కొన్నారు. కేరళ గడ్డపై రేవంత్ రెడ్డి చేస్తున్న రాజకీయ డ్రామాలు ఇక సాగవని కుండబద్దలు కొట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇతర ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి తీరుపై తెలంగాణ సమాజం ఆగ్రహంతో ఉందని కిషన్ రెడ్డి అన్నారు. అక్కడ చేసే ప్రసంగాల్లో తెలంగాణ అభివృద్ధి గురించి రేవంత్ చెప్తున్నవన్నీ కట్టుకథలేనని కొట్టిపారేశారు.

# వాట్సాప్‌లో 'లంచాల' రేట్లు

**మొదటిపేజీ తరువాయి**




ఏ డాక్యుమెంట్‌కు ఎంత ముట్టజెప్పాలనే అంశంపై సబ్ రిజిస్ట్రార్లు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన సంభాషణలు సాక్ష్యాధారాలతో సహా దొరికిపోయాయి. డిజిటల్ యుగంలో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాల్సింది పోయి దాన్ని అవినీతికి వేదికగా మార్చుకోవడం గమనార్హం. సబ్ రిజిస్ట్రార్లు రామ్ నర్సింహారావు, ఆనంద్ ఇద్దరూ కలిసి ఏజెంట్ల ద్వారా భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. గడిచిన ఏడాది కాలంలో కేవలం ఏజెంట్ల ద్వారానే సుమారు రూ. 42,03,125 వరకు లావాదేవీలు నడిపినట్లు అధికారులు నిర్ధారించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మొదలుకొని అగ్రికల్చర్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్ వరకు ప్రతి పనిలోనూ కమీషన్ల పర్వం సాగింది. డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నా సరే లంచం ఇవ్వనిదే ఫైల్ ముందుకు కదలని పరిస్థితిని వీరు కల్పించారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో సామాన్యులను ఇబ్బంది పెడుతూ కూడబెట్టిన ఈ సొమ్మంతా ఇప్పుడు ఏసీబీ అదుపులోకి చేరిపోయింది. ఈ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న 20 మంది నకిలీ ఏజెంట్లను అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ల సాకుతో కార్యాలయంలో తిష్టవేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అధికారులకు కమీషన్లు చేరవేస్తున్న ఈ మధ్యవర్తుల పాత్రపై లోతుగా విచారణ చేపట్టారు. ఆ సమయంలో కార్యాలయంలో ఉన్న 70 డాక్యుమెంట్లకు సంబంధించి ఎలాంటి లెక్కాపత్రం లేని రూ.47,450 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చిన్నపాటి మొత్తమే అనిపించినా ప్రతి డాక్యుమెంట్‌పై అదనంగా వసూలు చేస్తున్న తీరుకు ఇది నిదర్శనంగా నిలిచింది. కార్యాలయం లోపల ఒక సమాంతర వ్యవస్థ నడుస్తున్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. సోదాల పర్వం కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా అధికారుల నివాసాలకు కూడా పాకింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ నివాసంలో ఏసీబీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఆ ఇంట్లో నిల్వ ఉంచిన సంపదను చూసి అధికారులు నివ్వెరపోయారు. ఎక్కడ చూసినా నగదు కట్టలు, భారీగా బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ పరిమితికి మించి ఆస్తులను ఎలా సంపాదించారనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ సామాన్యుల కష్టార్జితాన్ని ఎలా దోచుకున్నారో ఈ సోదాలు తేటతెల్లం చేశాయి.

ఆనంద్ ఇంట్లో జరిపిన తనిఖీల్లో రూ.26,61,540 నగదును అధికారులు సీజ్ చేశారు. దీనితో పాటు 819.500 గ్రాముల బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. వీటి విలువ మార్కెట్ ధర ప్రకారం భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. కేవలం బంగారం మాత్రమే కాకుండా సుమారు 2.6 కిలోల వెండి సామాగ్రిని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక సాధారణ ఉద్యోగి నివాసంలో ఇంత భారీ మొత్తంలో నగదు, నగలు ఉండటం అక్రమ సంపాదనకు నిలువుటద్దంగా నిలిచింది. ఈ మొత్తం సంపాదనకు సంబంధించి ఆయన దగ్గర ఎలాంటి సరైన ఆధారాలు లేవని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

నగదు, నగలతో పాటు ఆనంద్ వివిధ ఆర్థిక సంస్థల్లో చేసిన పెట్టుబడులపై కూడా అధికారులు దృష్టి సారించారు. కపిల్ చిట్స్‌లో సుమారు రూ.30 లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్మును ఇలా వివిధ రూపాల్లో పెట్టుబడిగా మళ్లించినట్లు తెలుస్తోంది. ఇంకా ఎన్ని చోట్ల ఇలాంటి బినామీ పెట్టుబడులు ఉన్నాయనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. బ్యాంకు లాకర్లు, ఆస్తుల పత్రాల పరిశీలన పూర్తయితే మరిన్ని ఆసక్తికర విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. విచారణలో వెల్లడవుతున్న అంశాలు చూస్తుంటే ఇది ఒక పెద్ద కుంభకోణంలా కనిపిస్తోంది. వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఈ అక్రమాలపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. డాక్యుమెంట్ రైటర్లతో సబ్ రిజిస్ట్రార్లు నిర్వహించిన వాట్సాప్ చాటింగ్ స్క్రీన్ షాట్లు ఇప్పుడు కేసులో కీలక సాక్ష్యాలుగా మారాయి. టెక్నాలజీని వాడుకుని అవినీతికి పాల్పడటం వల్ల దొరకమని భావించిన అధికారులకు ఏసీబీ షాక్ ఇచ్చింది. ప్రతి రిజిస్ట్రేషన్ వెనుక ఎంత శాతం వాటా ఎవరికి వెళ్లాలో ముందే నిర్ణయించుకున్నట్లు ఈ సంభాషణలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని సామాన్యుడిని దోచుకున్న వైనంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అంతం చేస్తామని పాలకులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వడ్డేపల్లి ఘటనలో బయటపడిన అంశాలు కేవలం మంచుకొండ ఒక అంచు మాత్రమేనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలతో చెలరేగిపోతున్న ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. పారదర్శకంగా జరగాల్సిన పనులను క్లిష్టతరం చేస్తూ డబ్బులు డిమాండ్ చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థలో మార్పు వస్తుందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారంతో పాటు లభించిన డైరీలు, ఫోన్ డేటాను విశ్లేషిస్తున్నారు. ఇందులో ఇంకా ఎంతమంది ఉన్నతాధికారుల హస్తం ఉందనే కోణంలో విచారణ సాగుతోంది. త్వరలోనే వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి మరింత లోతుగా విచారించే అవకాశం ఉంది.

# పేదల ఇళ్లను కూలుస్తూ మాపై విమర్శలా?

**మొదటిపేజీ తరువాయి**



నిర్మాణాత్మక కార్యక్రమాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఆడంబరాలకు పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పక్క రాష్ట్రాలపై బురద చల్లడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని పినరయి తేల్చి చెప్పారు. డిజిటల్ పరిపాలన విషయంలో కేరళ దేశంలోనే అగ్రగామిగా ఉందని పినరయి విజయన్ గుర్తు చేశారు. 2025 సంవత్సరంలో తెలంగాణకు చెందిన ఉన్నతాధికారులు కేరళకు వచ్చి ఇక్కడి డిజిటల్ ల్యాండ్ రికార్డ్ సిస్టమ్‌ను నిశితంగా పరిశీలించారని ఆయన వెల్లడించారు. తమ రాష్ట్రంలోని పారదర్శక పాలనకు ఇది ఒక నిదర్శనమని పేర్కొన్నారు. వేరే రాష్ట్రాల నుంచి అధికారులు వచ్చి నేర్చుకుంటున్న వ్యవస్థపై రేవంత్ రెడ్డి విమర్శలు చేయడం అవగాహన రాహిత్యమేనని అన్నారు. అభివృద్ధి చెందిన కేరళ నమూనాను మెచ్చుకోవాల్సింది పోయి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పినరయి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న ఆలస్యంపై పినరయి విజయన్ విమర్శనాస్త్రాలు సంధించారు. సొంత రాష్ట్రంలో వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు సకాలంలో ఇవ్వలేని ప్రభుత్వం కేరళకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. పాలనలో లోపాలను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపై ఉందని గుర్తు చేశారు. కేరళలో సంక్షేమ ఫలాలు ప్రతి లబ్ధిదారుడికి నిర్దేశిత సమయంలో అందుతున్నాయని వివరించారు. రాష్ట్ర సరిహద్దులు దాటి వచ్చి రాజకీయాలు చేసే ముందు తమ రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చడంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. మంచి పాలన, సంక్షేమ పథకాల అమలు గురించి నేర్చుకోవాలంటే రేవంత్ రెడ్డి కేరళకు అతిథిగా రావాలని పినరయి విజయన్ ఆహ్వానించారు. కేరళ మోడల్ నేడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉందని, అనేక రాష్ట్రాలు దీనిని అనుసరిస్తున్నాయని చెప్పారు. తమ పాలన పారదర్శకంగా ఉంటుందని, అవినీతికి తావు లేదని భరోసా ఇచ్చారు. తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితి, పాలనాపరమైన ఇబ్బందులను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విమర్శలు కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని, వాటిలో ఎటువంటి వాస్తవం లేదని కొట్టిపారేశారు. కేరళలో అమలు చేస్తున్న విద్యా విధానం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని పినరయి విజయన్ పేర్కొన్నారు. సామాజిక న్యాయం పాటించడంలో తమ రాష్ట్రం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. పేదరికాన్ని పారదోలడంలో కేరళ సాధించిన విజయం రేవంత్ రెడ్డికి కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పుల వల్లే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తోందని వివరించారు. తెలంగాణలో మాదిరిగా ఇక్కడ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధానాలు లేవని ఘాటుగా సమాధానమిచ్చారు. రాజకీయ విమర్శలకు ఒక హుందాతనం ఉండాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. కేరళ అభివృద్ధిని తక్కువ చేసి మాట్లాడటం వల్ల అక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని వామపక్ష నాయకులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మరో రాష్ట్రానికి వెళ్ళినప్పుడు అక్కడి వ్యవస్థలను గౌరవించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కేవలం ఓట్ల కోసమే ఇలాంటి అవాస్తవ ప్రచారాలు చేయడం రాజకీయాల్లో ఆరోగ్యకరమైన ధోరణి కాదని హెచ్చరించారు. పినరయి విజయన్ ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కూడా చర్చకు దారితీసింది. తెలంగాణలోని విపక్షాలు కేరళ సీఎం వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి తన స్వరాష్ట్రంలో విఫలమవుతున్నారని, అందుకే పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్తున్నారని విమర్శిస్తున్నాయి. బుల్డోజర్ల అంశం ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. హైడ్రా వంటి సంస్థల ద్వారా చేపడుతున్న కూల్చివేతలను పినరయి ప్రస్తావించడం రేవంత్ సర్కార్‌ను ఆత్మరక్షణలో పడేసింది. ఈ వివాదం రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికి రేవంత్ రెడ్డి వర్సెస్ పినరయి విజయన్ మధ్య మొదలైన ఈ మాటల యుద్ధం దక్షిణాది రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. అభివృద్ధి నమూనాలపై రెండు రాష్ట్రాల మధ్య చర్చ మొదలైంది. రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు కేరళలో కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరుస్తాయా లేక పినరయి ఇచ్చిన సమాధానం వల్ల నష్టం జరుగుతుందా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి మాత్రం కేరళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గట్టిగానే సమాధానం ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్, వామపక్షాల మధ్య ఉన్న సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# టెక్స్‌టైల్స్ హబ్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**



ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. మన సంస్కృతిలో వస్త్రాలకు ఎంతటి ప్రాధాన్యం ఉందో వివరిస్తూ, టెక్స్‌టైల్స్ రంగం కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, అది వేలాది కుటుంబాలకు ప్రాణాధారమైన వృత్తి అని పేర్కొన్నారు. నేతన్నల నైపుణ్యం రాష్ట్ర కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తోందని, ఈ రంగంపై ఆధారపడిన ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి ఇక్కత్ డిజైన్ల నుంచి గద్వాల్ అద్భుతమైన చీరల వరకు తెలంగాణ సొంతమైన వైవిధ్యమైన శైలులను ఆయన కొనియాడారు. వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వస్త్రాల ప్రత్యేకతను వివరిస్తూ, వీటి వెనుక ఉన్న శ్రమను, కళను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మన రాష్ట్రంలో పండే పత్తి నాణ్యతలో మేటి అని, భారతదేశ పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గణాంకాలతో వివరించారు. ఇక్కడి పొలాల్లో పండే పత్తి, లండన్, న్యూయార్క్, పారిస్ వంటి ఫ్యాషన్ రాజధానుల వరకు చేరుతూ ప్రపంచ స్థాయి డిజైనర్లను ఆకర్షిస్తోందని తెలియజేశారు.

తెలంగాణ నేల నైపుణ్యాలకు, గట్టి సంకల్పానికి నిలయమని, కేవలం టెక్స్‌టైల్స్ మాత్రమే కాక డీప్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ వంటి అత్యాధునిక రంగాల్లోనూ మనం దూసుకుపోతున్నామని సీఎం వివరించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ విభాగాల్లో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని ఆయన వివరించారు. ప్రపంచ దేశాలకు అవసరమైన వ్యాక్సిన్లు, ఔషధాలను సరఫరా చేస్తూ వరల్డ్ ఫార్మసీగా పేరుగాంచిన రాష్ట్రం మనదని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ రానున్న రోజుల్లో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. భాగ్యనగరం ఇప్పుడు కేవలం దేశీయ సినిమా కేంద్రంగానే కాకుండా, ప్రపంచ సినిమా నిర్మాణానికి ప్రధాన చిరునామాగా మారుతోందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రఖ్యాత నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ మకాంలుగా మార్చుకున్నాయని, త్వరలోనే హాలీవుడ్ చిత్రాల నిర్మాణం కూడా ఇక్కడ జోరుగా సాగనుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సినీ రంగానికి అవసరమైన ఫ్యాషన్ అవసరాలను కూడా మన తెలంగాణ నుంచే తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక రంగంలో మనం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, గ్లోబల్ బ్రాండ్ ఆపిల్ సంస్థకు చెందిన ఇయర్ పాడ్స్ కూడా ఇక్కడే తయారవుతుండటం మన పారిశ్రామిక శక్తికి నిదర్శనమని రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. భూమి కేటాయింపు, నిరంతర విద్యుత్ సరఫరా, నీటి సదుపాయాలతో పాటు వేగవంతమైన అనుమతుల కోసం సింగిల్ విండో విధానాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని కోరారు. యువతకు, ముఖ్యంగా మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా వారి నైపుణ్యాలను మెరుగుపరిచి, సంప్రదాయ నేత కళను ఆధునిక టూల్స్‌తో అనుసంధానం చేస్తామని చెప్పారు. డిజైనింగ్, కట్టింగ్, స్టిచింగ్ వంటి అంశాల్లో అత్యాధునిక సాంకేతికతను జోడించి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను రూపొందించేలా ప్రోత్సహిస్తామన్నారు. మన వద్ద ఉన్న అత్యుత్తమ మానవ వనరులే మనకు పెద్ద బలమని, వారి మేధస్సుకు పదును పెడితే అద్భుతాలు సృష్టించవచ్చని ఆయన ఆకాంక్షించారు. పెట్టుబడిదారులతో కలిసి ఒక సమగ్రమైన టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ముందు మూసీని శుభ్రం చేయండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజధాని గుండెకాయ వంటి మూసీ నది ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' కీలక సూచనలు చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం చేపట్టడం కన్నా ముందు, దశాబ్దాలుగా మురికికూపంగా మారిన మూసీని శుభ్రం చేయడంపైనే దృష్టి సారించాలని స్పష్టం చేసింది. మతపరమైన కట్టడాల కంటే నదీ జలాల నాణ్యతను పెంచడం అత్యవసరమని పేర్కొంది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ మేరకు ఫోరం ఒక సమగ్ర రిప్రజెంటేషన్‌ను సమర్పించింది. మూసీ పునరుజ్జీవనం కోసం ప్రభుత్వం తీసుకున్న చొరవను స్వాగతించినప్పటికీ, ఆలయాల నిర్మాణం వంటి అంశాలపై తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ప్రభుత్వం మంచిరేవుల సమీపంలో ఒక ఆలయాన్ని నిర్మించాలని భావించడంపై ఫోరం విస్మయం వ్యక్తం చేసింది. నది తీవ్రమైన కాలుష్యంతో అల్లాడుతున్న తరుణంలో, ఆ సమస్యను పక్కనబెట్టి మతపరమైన నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరైన నిర్ణయం కాదని హితవు పలికింది. ముఖ్యంగా మార్చి 29వ తేదీన ఓంకారేశ్వరాలయానికి భూమిపూజ నిర్వహించడం, నది మధ్యలో 108 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అధికారులు ఆలోచన చేయడం వంటి పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆలయ నిర్మాణ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు రెండేళ్ల సమయం పడుతుందని అంచనా వేసిన ఫోరం, ముందుగా నదిని ప్రక్షాళన చేయకుండా ఇలాంటి పనులకు పూనుకోవడం వల్ల ఆశించిన ఫలితం ఉండదని తెలిపింది. గత ప్రభుత్వాల హయాంలో మూసీ శుద్ధి కోసం చేపట్టిన అరకొర ప్రయత్నాలను ఈ నివేదికలో ఫోరం అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి ప్రస్తావించారు. 2001లో కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో రూ.405 కోట్లు వెచ్చించి చేపట్టిన ప్రక్షాళన పనులు ఆశించిన మేర సత్ఫలితాలను ఇవ్వలేదని గుర్తు చేశారు. భారీగా నిధులు ఖర్చు చేసినా నది రూపురేఖలు మారకపోవడం వెనుక ఉన్న వైఫల్యాలను ఎత్తిచూపారు. కాలక్రమంలో నది మురుగు కాలువలా మారిపోవడానికి ప్రణాళికా లోపాలే ప్రధాన కారణమని విశ్లేషించారు.



వ్యవస్థల్లో మార్పు రాకుండా కేవలం నిధుల కేటాయింపుతో ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు.

హైకోర్టు పరిసరాల్లో రూ.50 కోట్లతో నిర్మించిన రబ్బర్ డ్యామ్ ప్రాజెక్టు వైఫల్యాన్ని కూడా ఈ నివేదికలో ఉదాహరణగా చూపారు. ఆర్భాటంగా ప్రారంభించిన ఆ ప్రాజెక్టు చివరికి విఫలమై, దాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. 2011లో రూ.750 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన 'మూసీ ఫేజ్ II' ప్రతిపాదనలకు ఆమోదం లభించకపోవడం, ఆ తర్వాత 2012లో రూ.17,130 కోట్లతో సిద్ధం చేసిన బృహత్తర ప్రణాళికలో ఉన్న సాంకేతిక లోపాల వల్ల అది కార్యరూపం దాల్చకపోవడం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

నగర విస్తరణతో పాటు సాగిన ఆక్రమణలు మూసీ నది ఉనికిని దెబ్బతీశాయని ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. నది వెడల్పు గణనీయంగా తగ్గిపోయి, అనేక చోట్ల అది కేవలం ఒక చిన్న కాలువలా దర్శనమిస్తోందని పేర్కొంది. నగరంలోని మురుగునీరు ఎటువంటి శుద్ధి లేకుండానే నేరుగా నదిలోకి చేరుతోందని, దీని వల్ల కాలుష్య స్థాయి ప్రమాదకర స్థాయికి చేరిందని హెచ్చరించింది. అక్రమ కట్టడాలను అరికట్టడంలో విఫలం కావడం వల్లే నది తన సహజత్వాన్ని కోల్పోయిందని నివేదికలో వివరించింది. ప్రభుత్వ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటేనే నదికి పూర్వ వైభవం సాధ్యమని స్పష్టం చేసింది.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నివేదికల ప్రకారం మూసీ నది దేశంలోని అత్యంత కాలుష్యిత నదుల్లో ఒకటిగా నిలిచిందని ఫోరం గుర్తు చేసింది. 2015లోనే కాలుష్య నియంత్రణ మండలి నది నీటి నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించింది. నదిలోని విషతుల్యమైన రసాయనాలు పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారాయని తెలిపింది. జాతీయ స్థాయి సంస్థలు హెచ్చరికలు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో మార్పు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేసింది. కాలుష్య నివారణే ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం పని చేయాలని కోరింది.

హైదరాబాద్ శివార్లలో ఉన్న ఔషధ కంపెనీలు, వివిధ పరిశ్రమలు తమ వ్యర్థాలను శుద్ధి చేయకుండానే మూసీలోకి వదులుతున్నాయని ఫోరం ఆరోపించింది. పారిశ్రామిక వ్యర్థాల వల్ల నది నీరు రంగు మారి, దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదని, నిర్వహణ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడించింది. పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, చట్ట విరుద్ధంగా వ్యర్థాలను వదిలే వారిని ఉపేక్షించకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో మూసీ నీరు ఏ రకంగానూ వినియోగించుకోవడానికి వీలులేకుండా తయారైందని ఫోరం ఆందోళన వ్యక్తం చేసింది. నదీ జలాల్లో జీవవైవిధ్యం నశించిపోయిందని, జలచరాలు మనుగడ సాగించలేని స్థితి నెలకొందని వివరించింది. వ్యవసాయానికి కూడా ఈ నీరు వాడటం వల్ల పంటలు విషతుల్యమవుతున్నాయని, పరోక్షంగా ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని హెచ్చరించింది. మానవ వినియోగానికి ఏమాత్రం యోగ్యం కాని ఈ నీటిని పవిత్రంగా భావించడం కష్టమని అభిప్రాయపడింది. నదిని జీవనదిగా మార్చినప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని తెలిపింది.

నదీ ప్రక్షాళన అనేది ఒకే రోజులో పూర్తయ్యే పని కాదని, ఇది సుదీర్ఘకాలం పట్టే క్లిష్టమైన ప్రక్రియ అని ఫోరం పేర్కొంది. కేవలం సౌందర్యీకరణ పనులు చేస్తే సరిపోదని, మూలాల నుంచి సమస్యను పరిష్కరించాలని సూచించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నదిలోకి మురుగు చేరకుండా చూడాలని కోరింది. దీర్ఘకాలిక లక్ష్యాలతో కూడిన ప్రణాళికను అమలు చేస్తేనే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన మూసీని అందించగలమని వెల్లడించింది. దీనికోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, వారి సలహాలను పాటించాలని కోరింది. కాలుష్యంతో నిండిన నదిలో శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గానీ, ఆలయాలను నిర్మించడం గానీ ఆధ్యాత్మికంగా కూడా అనుచితమని ఫోరం అభిప్రాయపడింది. పవిత్రమైన దేవతా మూర్తుల విగ్రహాలను మురుగు నీటి మధ్యలో ఉంచడం భక్తుల మనోభావాలకు విరుద్ధమని తెలిపింది. భక్తి కంటే ముందు నైర్మల్యం ముఖ్యం అన్న విషయాన్ని ప్రభుత్వం గమనించాలని సూచించింది. కాలుష్య కోరల్లో చిక్కుకున్న నదిని కాపాడటమే అసలైన సేవా కార్యక్రమమని పేర్కొంది. ముందుగా నదిని నిర్మలంగా మార్చి, ఆ తర్వాతే ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆలోచించాలని విజ్ఞప్తి చేసింది. మొత్తంగా మూసీ పునరుజ్జీవనంపై ప్రభుత్వం చూపుతున్న ఆసక్తిని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అభినందిస్తూనే, ప్రాధాన్యతలను మార్చుకోవాలని కోరింది. నదికి పట్టిన కాలుష్యపు పాపాన్ని కడిగివేసిన తర్వాతే ఆలయాల నిర్మాణం వంటి అంశాలను చేపట్టాలని పద్మనాభ రెడ్డి తన నివేదికలో స్పష్టం చేశారు. ప్రభుత్వ చిత్తశుద్ధి కేవలం నిర్మాణాల్లో కాకుండా, నది నీటి స్వచ్ఛతలో కనిపించాలని కోరుకుంది. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం వంటి అంశాలకు అగ్రపీఠం వేస్తూ ప్రభుత్వం అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఫోరం విన్నవించింది.

# 'రేవంత్‌ని ఓడించే పార్టీలో చేరతా'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. దశాబ్దాల కాలం పాటు హస్తం పార్టీకి వెన్నెముకగా నిలిచిన సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ గూటిని వీడి గులాబీ తీర్థం పుచ్చుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. జగిత్యాల వేదికగా శుక్రవారం ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన, తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. రేవంత్ రెడ్డిని ఏ పార్టీ అయితే ఓడించగలదో, ఆ పార్టీలోనే తాను చేరుతానని కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో తనకు తగిన గౌరవం దక్కడం లేదని, ముఖ్యమంత్రి ఒంటెద్దు పోకడల వల్ల పాతతరం నేతలకు విలువ లేకుండా పోతోందని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో మార్పు రావాలి, కేసీఆర్ వెళ్లాలి అని ప్రజలు కోరుకున్నారని, కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైందని ఆయన విశ్లేషించారు. కేవలం రెండేళ్ల పాలనలోనే రేవంత్ రెడ్డి దిగిపోవాలనే నినాదం ప్రజల నుంచి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన వారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై పట్టింపు లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణకు వరప్రదాయిని అయిన ప్రాణహిత జలాల వినియోగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి నివేదికలు వచ్చినప్పటికీ, పునర్నిర్మాణ పనులను చేపట్టకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, రాష్ట్ర భవిష్యత్తుపై రేవంత్ సర్కార్ సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. తన రాజకీయ పంథాపై స్పష్టత ఇస్తూ, రాబోయే ఒకటి రెండు వారాల్లో కీలక నిర్ణయం వెలువరిస్తానని జీవన్ రెడ్డి ప్రకటించారు. తన అనుచరులు, నియోజకవర్గ కార్యకర్తల అభీష్టం మేరకు అడుగులు వేయబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో తనను అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన చెందారు. ప్రజా సమస్యలపై పోరాడే గొంతుకను నొక్కేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఆయన భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ నెల 13వ తేదీన జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. అంతకంటే ముందే ఏప్రిల్ 7వ తేదీన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్వయంగా జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ ఉమ్మడి రాజకీయ భవిష్యత్తుపై చర్చించిన అనంతరం, కేటీఆర్ సమక్షంలోనే ఆయన గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. సీనియర్ నేత కావడంతో ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని గులాబీ శ్రేణులు ఇప్పటికే హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

జీవన్ రెడ్డి రాకను పురస్కరించుకుని జగిత్యాలలో భారీ బహిరంగ సభ లేదా ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించాలని బీఆర్ఎస్ అధిష్టానం యోచిస్తోంది. తద్వారా నియోజకవర్గంలో పార్టీ కేడర్ కు కొత్త ఉత్సాహాన్ని ఇవ్వాలని భావిస్తోంది. దశాబ్దాలుగా కాంగ్రెస్ కోటగా ఉన్న జగిత్యాలలో ఇప్పుడు సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. జీవన్ రెడ్డి వంటి మేధావి, నిబద్ధత గల నాయకుడు పార్టీని వీడటం హస్తం పార్టీకి కోలుకోలేని దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి పనితీరుపై మొదటి నుంచి పెదవి విరుస్తున్న ఆయన, ఇప్పుడు బహిరంగంగానే యుద్ధం ప్రకటించారు.

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ వ్యతిరేకత క్షేత్ర స్థాయిలో పెరిగిపోతోందని, దానిని అందిపుచ్చుకుని పోరాడే శక్తులతో తాను కలుస్తానని చెప్పారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించకుండా కేవలం కొందరి మాటలనే నమ్ముతోందని అసంతృప్తి వెలిబుచ్చారు. ఆత్మాభిమానం లేని చోట ఉండటం కంటే, తనను గౌరవించే వేదికను వెతుక్కోవడం మేలని ఆయన నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ల ప్రాధాన్యత తగ్గిపోతోందన్న వాదనకు జీవన్ రెడ్డి తాజా నిర్ణయం బలాన్ని చేకూరుస్తోంది. యువ నాయకత్వం పేరుతో పాత తరం నాయకులను పక్కన పెట్టడం వల్ల పార్టీ నష్టపోతుందని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరంకుశత్వానికి తావులేదని, నాయకుడు అందరినీ కలుపుకుని వెళ్లినప్పుడే విజయం సాధ్యమవుతుందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి శైలి పట్ల కేవలం తాను మాత్రమే కాకుండా, పార్టీలో చాలా మంది నేతలు అసంతృప్తితో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారంతా బయటకు వస్తారని జోస్యం చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయింపులో కూడా వివక్ష చూపిస్తున్నారని జీవన్ రెడ్డి ఆరోపించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలిసినా ఫలితం లేదని, వినతులు బుట్టదాఖలు అవుతున్నాయని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో పదవుల కంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని భావించి రాజీనామా బాట పట్టినట్లు వివరించారు. బీఆర్ఎస్ లో చేరిన తర్వాత ప్రజా సమస్యలపై తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తానని స్పష్టం చేశారు. జగిత్యాల గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి నిష్క్రమణతో జిల్లాలో కాంగ్రెస్ కు పెద్ద లోటు ఏర్పడనుంది. ఆయనతో పాటు పలువురు స్థానిక సంస్థల ప్రతినిధులు, ముఖ్య నేతలు కూడా పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇది జరిగితే ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ కు గట్టి షాక్ తగిలినట్లే. అధికారం చేతిలో ఉన్నా సొంత నేతలను కాపాడుకోలేకపోవడం రేవంత్ రెడ్డి వైఫల్యమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమన్నట్లుగా, బద్ధశత్రువులుగా ఉన్న వారు కూడా ఇప్పుడు ఒక్కటవుతున్నారు. మొత్తానికి జీవన్ రెడ్డి ఎపిసోడ్ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. పదిహేను రోజుల వ్యవధిలో జరగబోయే పరిణామాలు జగిత్యాల రాజకీయాలను మలుపు తిప్పనున్నాయి. రేవంత్ రెడ్డిని గద్దె దించడమే లక్ష్యంగా ఆయన వేస్తున్న అడుగులు ఎంతవరకు సఫలమవుతాయో చూడాలి. సీనియర్ నాయకుడి ఆగ్రహం అధికార పార్టీకి హెచ్చరికగా మారుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. ఏదేమైనా 13వ తేదీన జగిత్యాలలో జరగబోయే భారీ సభపైనే ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# కేరళలో రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. రాష్ట్రంలో ఇచ్చిన హామీల అమలును గాలికొదిలేసి, పక్క రాష్ట్రాల్లో ప్రచార పర్వంలో మునిగితేలుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై మాజీ మంత్రి హరీష్ రావు నిప్పులు చెరిగారు. సొంత గడ్డపై పాలన అస్తవ్యస్తంగా ఉంటే, కేరళ వంటి ప్రాంతాలకు వెళ్లి అబద్ధాలను వల్లెవేయడం ముఖ్యమంత్రికి తగదని ఆయన హితవు పలికారు. పాలనలో పట్టు కోల్పోయిన ప్రభుత్వం, ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే పరాయి రాష్ట్రాల్లో పర్యటనలు చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని గ్రామసభలే కాంగ్రెస్ వైఫల్యాలకు అద్దం పడుతున్నాయని హరీష్ రావు విశ్లేషించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేడు ప్రజలను ముఖం చాటు చేస్తోందని విమర్శించారు. గ్రామాల్లో జరుగుతున్న సభలకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను సామాన్య ప్రజలు నిలదీస్తుండటం చూస్తుంటే, ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇంట్లో ఈగల మోత ఉంటే బయట పల్లకీలు మోస్తున్నట్లుగా ముఖ్యమంత్రి తీరు ఉందంటూ ఆయన ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించకుండా గాలిలో మేడలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. యువతను ఆకర్షించేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగాల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పటివరకు కేవలం పదహారు వేల ఉద్యోగాలతోనే సరిపెట్టడం నిరుద్యోగులను వంచించడమేనని తేల్చిచెప్పారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని, కొత్త నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతుంటే సమాధానం చెప్పలేని స్థితిలో పాలకులు ఉన్నారని, అందుకే ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ కేవలం కాగితాలకే పరిమితమైందని హరీష్ రావు ఆక్షేపించారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాలంలో ఎస్టీ కార్పొరేషన్ కోసం సుమారు రెండు వేల ఏడు వందల ముప్పై కోట్ల రూపాయలు కేటాయించి, అందులో కేవలం యాభై కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు. నిధుల కేటాయింపులో ఒక రకమైన లెక్కలు చూపిస్తూ, ఖర్చు చేసే దగ్గర మరొక రకమైన వివక్షను ప్రదర్శిస్తున్నారని అన్నారు. దళితులు, గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాలను ఓటు బ్యాంకుగా చూస్తున్న కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందని హరీష్ రావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం ద్వారా వారికి రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ఫలాలను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో దళిత బంధు వంటి విప్లవాత్మక పథకాల ద్వారా ప్రతి ఇంటా వెలుగులు నింపాలని ప్రయత్నిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాలను అటకెక్కించి దళితుల నోట్లో మట్టి కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆచరణలో విఫలమైన ప్రభుత్వం ప్రకటనలతో కాలం గడుపుతోందని ఆయన ఆరోపించారు. రాజకీయ ప్రాతినిధ్యం విషయంలోనూ గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని హరీష్ రావు గళమెత్తారు. రాష్ట్రంలో గణనీయమైన జనాభా ఉన్న లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం వారిని అవమానించడమేనని అన్నారు. మంత్రి పదవి ఇవ్వకుండా గిరిజనులను కేవలం ఓటర్లుగానే చూస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజనులకు సామాజిక, రాజకీయ గౌరవం కల్పించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిధులుగా వారి గొంతుకను అసెంబ్లీలో వినిపించకుండా చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ విజయాలను ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తుచేశారు. గిరిజనుల చిరకాల స్వప్నమైన పది శాతం రిజర్వేషన్లను అమలు చేసిన ఘనత కేసీఆర్ సర్కారుదేనని స్పష్టం చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వారి గడప వద్దకే పాలనను తీసుకువచ్చిన విషయాన్ని ఎవరూ మరువలేరని అన్నారు. స్వయం పాలన ద్వారా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు తీసిందని, కానీ నేడు కాంగ్రెస్ పాలనలో మళ్ళీ పాత రోజులు దాపురించాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పథంలో సాగుతున్న రాష్ట్ర ప్రగతి చక్రాలను కాంగ్రెస్ వెనక్కి నెడుతోందని ఆయన ఘాటుగా విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో చేస్తున్న ప్రసంగాల్లో తెలంగాణ అభివృద్ధి గురించి చెబుతున్నవన్నీ అవాస్తవాలని హరీష్ రావు కొట్టిపారేశారు. ఇక్కడ రైతులు రుణమాఫీ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అక్కడ రైతు రాజ్యం నడుస్తోందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం చేతులెత్తేసినా, పొరుగు రాష్ట్రాల్లో మాత్రం అంతా సవ్యంగా సాగుతోందని నమ్మబలుకుతున్నారని చెప్పారు. ప్రజల కళ్లు కప్పి ఎక్కువ కాలం రాజకీయం చేయలేరని, వాస్తవాలు త్వరలోనే బయటపడతాయని ఆయన హెచ్చరించారు. అబద్ధపు ప్రచారాలు మానుకొని వాస్తవ పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన కోరారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైనదని, తప్పుడు వాగ్దానాలను ఎంతో కాలం భరించదని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, గిరిజన సామాజిక వర్గాలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టడం ఆపి, క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పరిపాలన అంటే ప్రచారం కాదని, ప్రజల కష్టాలను తీర్చడమని ముఖ్యమంత్రి తెలుసుకోవాలని హరీష్ రావు హితవు పలికారు. కేరళ పర్యటనలో రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా అవాస్తవాలు మాట్లాడటం మానుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు అందక సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించాలని, అధికారులను సమన్వయం చేసుకుంటూ పాలనను పట్టాలెక్కించాలని కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పక్క రాష్ట్రాల్లో తిరగడం వల్ల తెలంగాణ ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమీ లేదని ఆయన గట్టిగా చెప్పారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సమంజసం కాదని అన్నారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**విశాలభారతి, మెదక్ ప్రతినిధి :** దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం *అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ , సంఘ నాయకులు యాదగిరి,తో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ* దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీ.సీ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైన్స్‌లో దొంగతనం

**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి సమీపంలోని రాజరాజేశ్వర వైన్స్ లో దొంగతనానికి పాల్పడిన నిందితులను సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ సిఐ లక్ష్మీ బాబు తెలిపిన వివరాల ప్రకారం వైన్స్ మార్చి 28వ తేదీన రాత్రి పది గంటలకు బందు చేసి వెళ్లి తిరిగి 29వ తేదీన వచ్చి చూడగా షట్టర్ కొంచెం తెరిచి ఉండడంతో అనుమానం వచ్చిన యజమాని పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల ద్వారా పరిశీలించిన పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులు షేటర్ పైకి లోపలికి చొరబడ్డట్లు గుర్తించారు. వివిధ రకాల బ్రాండెడ్ కు సంబంధించిన 33 మద్యం బాటిల్లు.. 7 బీరు సీసాలు కౌంటర్ లో కొంత నగదును దొంగలించినట్లు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఈనెల మూడవ తేదీన పొన్నాల సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు. వారి నుండి రెండు మద్యం బాటిల్స్ మూడు సెల్ఫోన్లను వారు ప్రయాణించే కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్ తరలించారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత సీసీ కెమెరాలు ఆధారంగా ఆధునిక సాంకేతికతతో నిందితులను గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై మల్లేశం, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్, బాబులను సిఐ అభినందించారు. సీసీ కెమెరాల ఆధారంగానే నిందితుల కదలికలను గుర్తించి పట్టుకోవడం సులభతరం అయిందని వ్యాపార సంస్థలు ఉన్నచోట సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సిఐ సూచించారు.



# పౌర సరఫరాల విభాగం నిద్రపోతుందా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ఇంధన సెగలు సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ యుద్ధ మేఘాలు, మరోవైపు చమురు కంపెనీల కఠిన నిబంధనల మధ్య వినియోగదారులు అష్టకష్టాలు పడుతున్నారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరుతున్న వాహనాలు, వంటగ్యాస్ కోసం ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న గృహిణుల అవస్థలు చూస్తుంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. డొమెస్టిక్ సిలిండర్ బుక్ చేసుకున్న వారికి ఈకేవైసీ పేరుతో డెలివరీ నిలిపివేస్తుండటంతో సామాన్యుడి వంటిల్లు చిన్నబోతోంది. సిలిండర్ కోసం ఫోన్ చేస్తే ఈకేవైసీ పూర్తి కాలేదంటూ సాకులు చెబుతున్న ఏజెన్సీలు, గ్యాస్ సరఫరా చేయకుండా వినియోగదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు జటిలమవుతున్నా అధికారులు స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతకు ప్రధాన కారణం ఇరాన్ యుద్ధ ప్రభావమని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. యుద్ధ పరిణామాల నేపథ్యంలో చమురు కంపెనీలు బంక్ యజమానులకు గతంలో ఇస్తున్న క్రెడిట్ సౌకర్యాన్ని అకస్మాత్తుగా రద్దు చేశాయి. హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం, ఇండేన్ ఆయిల్ కార్పొరేషన్లు ఇప్పుడు నగదు చెల్లిస్తేనే ట్యాంకర్లను పంపిస్తున్నాయి. అప్పటికప్పుడు భారీ మొత్తంలో నగదు సర్దుబాటు చేయలేక డీలర్లు సతమతమవుతున్నారు. దీంతో స్టాక్ తక్కువగా ఉండటం, మరోవైపు సోషల్ మీడియాలో నిల్వలు నిండుకుంటున్నాయనే ప్రచారం జోరందుకోవడంతో వాహనదారులు బంకులపైకి ఎగబడ్డారు. ఎప్పుడూ రూ. వందతో సరిపెట్టుకునే వారు సైతం ఫుల్ ట్యాంక్ చేయించుకోవడంతో ఉన్న నిల్వలు కాస్తా క్షణాల్లో ఆవిరైపోతున్నాయి.



బంకుల వద్ద రద్దీని నియంత్రించడం పోలీసులకు సవాలుగా మారింది. అనేక చోట్ల గొడవలు జరగకుండా బంకుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నానికే బోర్డులు పెట్టేస్తున్న బంకులను చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేవలం క్రెడిట్ సౌకర్యం నిలిపివేత మాత్రమే కాకుండా, డిమాండ్‌ను అడ్డం పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టించే కుట్రలు జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయిల్ కంపెనీలు ట్యాంకర్ల సరఫరాలో కావాలనే జాప్యం చేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. పౌర సరఫరాల శాఖకు చమురు సంస్థల ప్రతినిధులపై పట్టు లేకపోవడం వల్లే ఈ అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని మాజీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధం వంటి అత్యవసర సమయాల్లో చమురు సంస్థలతో నిరంతరం సమీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మార్కెట్‌లో డిమాండ్ ఎంత ఉంది, సరఫరా ఎంత జరుగుతోంది అనే అంశాలపై రోజువారీ పర్యవేక్షణ ఉండాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు వివరించి, సజావుగా సరఫరా జరిగేలా చూడటంలో పౌర సరఫరాల విభాగం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ కంపెనీలు మొండికేస్తే కేంద్రానికి లేఖలు రాసి సమస్యను ఉన్నత స్థాయిలో పరిష్కరించాలి. కానీ, తెలంగాణలో అలాంటి ప్రయత్నాలేవీ కనిపించకపోవడం గమనార్హం. అధికారులు మిన్నకుండటంతో డీలర్లు, కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. వంటగ్యాస్ విషయంలో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు అక్రమంగా మళ్లిస్తున్నారనే ఆరోపణలు నిజమనిపిస్తున్నాయి. ఇటీవల పంజాగుట్ట స్మశాన వాటికలో భారీగా కమర్షియల్ సిలిండర్లు లభ్యం కావడం దీనికి నిదర్శనం. ఆన్‌లైన్‌లో బుక్ చేసినా పది రోజులైనా డెలివరీ కావడం లేదు. వినియోగదారులు ఏజెన్సీలకు వెళ్తే అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. అడ్రస్ సరిగ్గా లేదని, 35 రోజుల నిబంధన ఉందని కొత్త కొత్త సాకులు వెతుకుతున్నారు. ఈకేవైసీ కోసం గంటల తరబడి క్యూలలో నిల్చోబెట్టి వేధిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో చేసుకోలేని వృద్ధులు, సామాన్యులు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నారు. చమురు కంపెనీల ప్రతినిధులను పౌర సరఫరాల భవన్‌కు పిలిపించి కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఈ పరిస్థితి అదుపులోకి రాదు. ప్రభుత్వ రంగ సంస్థలైనప్పటికీ, అవి కేవలం లాభాపేక్షతోనే వ్యవహరిస్తున్నాయని రిటైర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారుల కష్టాలను పట్టించుకోకుండా కేవలం వ్యాపార కోణంలోనే నిర్ణయాలు తీసుకోవడం తగదు. సరఫరా, డిమాండ్ మధ్య వ్యత్యాసాన్ని తగ్గించకపోతే మున్ముందు గ్యాస్ బుకింగ్ పెండింగ్ మరింత పెరిగే ప్రమాదం ఉంది. దీనివల్ల సామాన్య ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. క్రెడిట్ సౌకర్యాన్ని పునరుద్ధరించేలా ఆయిల్ కంపెనీలపై ఒత్తిడి తేవడం ప్రస్తుతానికి అత్యంత అవసరం. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా పావులు కదుపుతోంది. అక్కడ వ్యాపారులకు ఊరటనిస్తూ కేంద్రం కమర్షియల్ గ్యాస్ కోటాను 70 శాతం పెంచేలా చర్యలు తీసుకుంది. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా కంపెనీల ప్రతినిధులతో సమావేశమై సరఫరా పరిస్థితిని చక్కదిద్దుతున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ల ద్వారా గ్యాస్ కేటాయింపులను పర్యవేక్షిస్తున్నారు. కానీ తెలంగాణలో మాత్రం అలాంటి ఉత్సాహం అధికారుల్లో గానీ, పాలకుల్లో గానీ కనిపించడం లేదని ప్రజలు భావిస్తున్నారు. ఇక్కడ కూడా ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించి, పెట్రోల్ బంకులకు, గ్యాస్ ఏజెన్సీలకు నిరంతర సరఫరా అందేలా చూడాలి. గ్యాస్ ఏజెన్సీల వద్ద సామాన్యులను ఇబ్బంది పెట్టే ఈకేవైసీ ప్రక్రియను సరళతరం చేయాలి. సాంకేతిక కారణాలు చూపి డెలివరీ నిలిపివేసే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వినియోగదారులు ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనను తొలగించాల్సిన బాధ్యత రాష్ట్ర యంత్రాంగంపై ఉంది. ఆయిల్ కంపెనీలు తమ నిబంధనలను సడలించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరపాలి. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగే అవకాశం ఉన్నా, కనీసం అందుబాటులో ఉన్న నిల్వలను ప్రజలకు చేర్చడంలో జాప్యం జరగకూడదు. సకాలంలో సరఫరా జరగకపోతే బ్లాక్ మార్కెట్ దందాలు పెచ్చుమీరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ పౌర సరఫరాల విభాగం వెంటనే స్పందించి క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలి. అక్రమ నిల్వలు ఉంచుతున్న బంకులు, సిలిండర్లను దారి మళ్లిస్తున్న ఏజెన్సీలపై నిఘా పెట్టాలి. ప్రతిరోజూ ఆయిల్ సరఫరా నివేదికలను తెప్పించుకుని ఎక్కడ కొరత ఉందో అక్కడ తక్షణమే స్టాక్ పంపేలా చర్యలు తీసుకోవాలి. కేవలం యుద్ధం పేరుతో ప్రజలను వంచించడం తగదు. సామాన్యుడికి ఇంధనం అందక పోతే రవాణా వ్యవస్థ స్తంభించి, నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇది గొలుసుకట్టు సమస్యగా మారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రభుత్వం మేల్కోవాలి. సిలిండర్ బుక్ చేసిన 24 గంటల్లోనే ఇంటికి చేరేలా గతంలో ఉన్న వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టాలి. ఈకేవైసీ అనేది ఒక నిరంతర ప్రక్రియగా ఉండాలి తప్ప, దానిని సరఫరాకు అడ్డంకిగా మార్చకూడదు. అధికారులు ఏజెన్సీలతో కుమ్మక్కయ్యారనే విమర్శలు రాకుండా పారదర్శకత పాటించాలి. ప్రజల అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం వహిస్తే అది పెను రాజకీయ సంక్షోభానికి దారితీస్తుంది. కాబట్టి పెట్రోలియం కంపెనీల ప్రతినిధులతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, డీలర్లకు క్రెడిట్ సౌకర్యం కల్పించేలా కృషి చేయాలి. యుద్ధం ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు కాబట్టి, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందడుగు వేయాలి.

## డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు

**డైరెక్టర్ భారతి హోలికేరి సూచనలు**



**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లాలో జరుగుతున్న జనాభా లెక్కల ఏర్పాట్లను డైరెక్టర్ జనాభా లెక్కల అధికారి శ్రీమతి భారతి హోలికేరి పరిశీలించారు. ఈ సందర్భంగా మండల స్థాయి మాస్టర్ శిక్షణ అధికారుల సమావేశానికి హాజరై, శిక్షణ పొందుతున్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా, నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు పక్కా సర్వే నిర్వహించి జనాభా గణన చేపట్టాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడంలో జనాభా గణాంకాలు ఎంతో కీలకమని తెలిపారు. దేశంలో మొదటిసారిగా ఈ జనాభా లెక్కల సర్వేను డిజిటల్ విధానంలో మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను జనాభా గణన ప్రారంభానికి ముందే అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అలాగే మండల స్థాయి శిక్షణ అధికారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, తిరిగి తమ మండలాల్లోని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సమగ్ర శిక్షణ ఇచ్చి జనాభా లెక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో జనాభా లెక్కల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు.

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**



**మహబూబాబాద్ , విశాలభారతి:** తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం మరియు బీసీ సంక్షేమ కమిషనర్ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో ముఖ్య అతిథిగా పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, స్వాభిమానం, హక్కుల కోసం ఆయన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు.ముఖ్యంగా యువత ఆయన ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని వివిధ యాదవ సంఘాల నాయకులు, ప్రజ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య వంటి మహనీయుల జయంతి కార్యక్రమాలు యువతలో చరిత్రపట్ల అవగాహన పెంపొందించడమే కాకుండా, సమాజ సేవా భావనను బలపరుస్తాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## గుర్తింపు కార్డుల జారీపై స్పష్టత ఇవ్వాలి

**ప్రజానాట్యమండలి డిమాండ్**



**ఆలేరు, విశాలభారతి:** తెలంగాణ ప్రజానాట్యమండలి వృత్తి కళాకారుల కోలాట కళాకారుల సమావేశం ఈరోజు ఆలేరు సిపిఐ పార్టీ కార్యాలయంలో జోగు స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కా వెంకటేష్ మాట్లాడుతూ, కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మీ సేవలో ఆప్షన్ ప్రవేశపెట్టిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కళాకారులు దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ, డిపిఆర్‌లో సంస్కృతి శాఖ బాధితులుగా పేర్కొంటూ సంతకాలు తీసుకోవడం అవసరం లేదని స్పష్టం చేశారు. కళాకారులకు అనవసర అడ్డంకులు లేకుండా, సులభంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అనవసర షరతులు లేకుండా సంతకాలు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని చెక్కా వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కళాకారులు రేణుక, మహేశ్వరి, యాదమ్మ, జోగు శంకర్, ఐలయ్య, సామి, లక్ష్మి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

**నిజామాబాద్, విశాలభారతి:** ఫైర్‌స్టేషన్ ఎస్ఎఫ్‌వో శంకర్ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఫస్ట్‌ఫ్లోర్‌లో పేషెంట్‌తో వచ్చిన ఓ వ్యక్తి బీడీ తాగి పడేయడంతో స్మోక్ పైప్‌కు నిప్పంటుకుని పొగ వ్యాపించింది. అది నేరుగా 6వ అంతస్తు వరకు వెళ్లింది. భారీ పొగను గమనించిన వైద్యులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది క్షణాల్లోనే ఆస్పత్రికి చేరుకొని రెండు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి జీజీహెచ్‌కు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో స్మోక్ పైప్‌కు నిప్పంటుకోగా.. పొగ ఏకంగా 6వ ఫ్లోర్‌కు చేరింది. ఆరోఫ్లోర్‌లో భారీగా మెడికల్ సామగ్రి ఉంది. మంటలు అదుపులోకి రాకపోయి ఉంటే మెడికల్ స్టోరేజ్ సామగ్రి సైతం కాలిపోయి ఉండేది.

## నవ దంపతులను ఆశీర్వదించిన ప్రతినిధులు



- కురవి గ్రామ సర్పంచ్ బాదావత్ లక్ష్మీ-రాజునాయక్,
- టియుడబ్ల్యూజే ఐజేయు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నిలుగొండ రాజు-లక్ష్మి దంపతుల కుమారుడు వేణు-శివానిల వివాహానంతర విందు కార్యక్రమం కురవిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన ప్రముఖులు నవ దంపతులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కురవి గ్రామ సర్పంచ్ బాదావత్ లక్ష్మీ-రాజునాయక్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే టియుడబ్ల్యూజే ఐజేయు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కురవి మండల ప్రధాన కార్యదర్శి అవిరె మోహన్ రావు, మాజీ వార్డ్ సభ్యులు ఇరుగు వెంకన్న, లక్ష్మినారాయణ పాల్గొని కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా బీఆర్ఎస్ నాయకులు దడిగల రవి, గజ్జెల్ల సత్యనారాయణ, ఆమెడ వెంకన్న, నవీన్, రాము తదితరులు వేడుకలో పాల్గొని నూతన దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆత్మీయంగా మార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధమని, నవ దంపతులు పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలతో ఆదర్శ దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అతిథులకు ఆతిథ్యం పలకగా, కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. వివాహానంతర విందు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, హాజరైన అతిథులు కుటుంబ సభ్యులను అభినందించి, వేడుకను మరింత శోభాయమానం చేశారు.

## బండరావిరాలలో 100 కెవి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



- బండరావిరాలలో 100 కెవి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు – సర్పంచ్ విజయ్ కుమార్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం బండరావిరాల గ్రామంలోని ఇందిరానగర్ కాలనీలో నూతన 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. గ్రామ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ శాఖ ADE శ్రీనివాస్ , AE నరేందర్ మాట్లాడుతూ.. గ్రామంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా వోల్టేజ్ సమస్యలు తొలగి రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా, వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో ఈ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం సహకరించిన విద్యుత్ శాఖ అధికారులను గ్రామ పాలక మండలి తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూస శంకర్, వార్డు సభ్యులు ఏర్పుల హరికృష్ణ, గుండ్ల భవాని-శివ ముదిరాజ్, కందికంటి అనూష-ప్రవీణ్, కన్నె భరత్ యాదవ్, యువ నాయకులు గుండ్ల సతీష్ యాదవ్, చింతకింది రాజు యాదవ్, మంకిరి యాదగిరి, కన్నె లింగస్వామి, నెమరుగోముల కరుణ్, విద్యుత్ శాఖ సిబ్బంది రామచందర్, లింగం తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదవిలో ఉన్నా.. లేకున్నా పనులు ఆగవు

**ఉప్పల్–నారపల్లి కారిడార్ పేరు రాజకీయాలకు బలి కాకూడదు: బండారి లక్ష్మారెడ్డి**



**విశాలభారతి, కాప్రా:** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై మాజీ బిజెపి ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ మీద విమర్శలు గుప్పించారు.కానీ ఇది కేవలం పేరు వివాదం కాదు ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఇది ఒక పేరు కాదు నిలువెత్తు ఒక సేవా చరిత్ర కు నిలువెత్తు స్మారకం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కాప్రాలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దాదాపు 150 కోట్ల తో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ వ్యతిరేకించడం పట్ల తీవ్రంగా ఖండించారు. బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. ఆ సేవలకు గుర్తింపుగా ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వాజపేయి పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ అర్థరహితంగా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీరమయ్య జాతరకు కనీస సౌకర్యాలు కల్పించండి

**తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తొర్రమ్ సంతోష్**



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామపంచాయతీ తెలంగాణ మరియు చతిస్గడ్ రాష్ట్ర సరిహద్దు వెలసిన శ్రీ బీరమయ్య జాతర గిరిజన సంప్రదాయంలో ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి తర్వాత నిర్వహించడం జరుగుతుంది. ఈ జాతరకు తెలంగాణ, చతిస్గడ్, మహారాష్ట్ర నుండి అత్యధిక జనాభా సందర్శించి స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. వేలాదిమంది తరలివచ్చే బీరమయ్య జాతరకు కనీస సౌకర్యాలు మంచినీరు, నీడ, విద్యుత్ రవాణా సౌకర్యం లేక భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అని వాజేడు మండల తుడుం దెబ్బ అధ్యక్షులు సంతోష్ మండల కమిటీ సభ్యులు గుడిని సందర్శించి కనీస సౌకర్యాలు ప్రభుత్వ అధికారులు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చాప లక్ష్మణ్, సంతోష్ టేకులగూడెం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని చొక్ల తండలో శుక్రవారం నరేష్-మౌనిక (తార మౌనిక)ల రిసెప్షన్ వేడుక ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరిగింది. చొక్ల తండకు చెందిన బానోత్ ద్వాలు-బుజ్జి దంపతుల కుమారుడు నరేష్ వివాహానంతర విందు కార్యక్రమం వారి స్వగృహంలో సాదరంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో ఈ వేడుక హర్షాతిరేక వాతావరణంలో సాగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, పరస్పర ప్రేమాభిమానాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలు, గ్రామీణ సంప్రదాయాలు కలిసే ఇలాంటి వేడుకలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. రిసెప్షన్ కార్యక్రమంలో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించిన కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో ఏర్పాట్లు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. వధూవరులు ప్రత్యేక అలంకరణల మధ్య అతిథులను ఆహ్వానిస్తూ అందరితో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో బానోత్ రాజు నాయక్, గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. మొత్తం వేడుక ఆప్యాయత, ఆనందం, సంప్రదాయం కలగలిపిన కుటుంబోత్సవంగా నిలిచింది.

## ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు



**మునుగోడు, విశాలభారతి:** మునుగోడు పట్టణ కేంద్రంలో శుక్రవారం దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను కురుమ యువ చైతన్య సమితి కేవైసీ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య ఆశయాలను యువత స్ఫూర్తి గా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ కురుమ, మునుగోడు మండల అధ్యక్షులు బండారు శ్రీనివాస్ కురుమ, బండారు మహేశ్ కురుమ, మెట్టు శంకర్ కురుమ, మాల్గ యాదయ్య కురుమ, బండారు చరణ్ కురుమ తదితరులు ఉన్నారు.

## నవ దంపతులకు ఆశీస్సులు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**మరిపెడ , విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం జీనియ తండలో బానోత్ సక్రం కుమారుడు బానోత్ నవీన్ మరియు శశిరేఖ దంపతుల వివాహ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలోత్ వెంకన్న, బానోత్ సురేష్ అతిథులుగా హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివాహ బంధం అనేది ఇద్దరు వ్యక్తులకే కాకుండా రెండు కుటుంబాల అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. నవ దంపతులు పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలతో జీవితాన్ని సుఖసంతోషాలతో కొనసాగించాలని ఆకాంక్షించారు. కుటుంబ విలువలు, సంప్రదాయాలు, పెద్దల ఆశీస్సులు కలిసి దాంపత్య జీవితాన్ని మరింత ఆనందమయం చేస్తాయని తెలిపారు. గ్రామస్థులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వేడుక ఆప్యాయతతో నిండిన కుటుంబ వాతావరణంలో సాగింది. నూతన వధూవరులకు హాజరైన అతిథులు శుభాకాంక్షలు తెలియజేసి వారి భవిష్యత్ జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాము, రాజేష్, హోలీ తదితరులు పాల్గొన్నారు.

## మందనపల్లిలో దొడ్డి కొమురయ్య జయంతి

**ఆలేరు,విశాలభారతి :** ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో పోరాటయోధుడు, అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.కురుమ సంఘం అధ్యక్షుడు నారీ వీరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కర్రె సత్తయ్య, మాజీ సర్పంచ్ పందరి, ఉప సర్పంచ్ సత్యనారాయణ, రాము, కృష్ణ, దశరథ, బాలరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# నాల లు కబ్జా చేస్తే ఊరుకునేది లేదు

**నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరిక**

**విశాలభారతి, గోదావరిఖని:**




నాలా లు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. హెచ్చరించడమే కాకుండా 35 వ డివిజన్ వార్డు సందర్శన కార్యక్రమం లో భాగంగా శుక్రవారం ఐ బి కాలనీ లో పర్యటించిన ఆయన ప్రదాన కాలువ కల్వర్ట్ ప్రక్కన అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని జె సి బి యంత్రం తో కూల్చివే యించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలలో పూడిక తీత కార్యక్రమం నిరంతరంగా కొనసాగడానికి బఫర్ జోన్ అవసరమని అన్నారు. బఫర్ జోన్ ఆక్రమించి కట్టుకుంటే కూల్చివేయక తప్పదని అన్నారు. బఫర్ జోన్ లో సానిటేషన్ ట్రాక్టర్ వెళ్ళడానికి వీలుగా సి సి రోడ్డు కూడా నిర్మిస్తామని అన్నారు. గతంలో కాలువల్లో పూడిక తీత అంటే లక్షల రూపాయలు వెచ్చించి టెండర్ పిలిచి తూతూ మంత్రంగా పనులు చేసేవారని ప్రస్తుతం నగర పాలక సంస్థ పై ఆర్థిక భారం పడకుండా మున్సిపల్ యంత్రా లతో , మున్సిపల్ సిబ్బందితోనే పని చేయిస్తున్నామని అన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా మునిసిపల్ వాహనానికి ఇవ్వాలని చేతులు జోడించి వేడుకుం టున్నానని అన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన పరిశుభ్రం చేయడానికి డబ్బు వృధా కావడంతో పాటు మురుగు నీరు సాఫీ గా పర్వహించకుండా నిలిచిపోయి దుర్వాసన , దోమలతో ప్రజలు అనారో గ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జంగపెల్లి రమాదేవి శ్రీనివాస్ తో పాటు పలువురు కార్పొరేటర్లు కంకణాల మౌనిక రాజు , వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, ధూళి కట్ట సతీష్ పలువురు నాయకులు వేగోలపు శ్రీనివాస్ , పీచర శ్రీనివాస రావు , కాలనీ వాసులు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , తుప్పలను తొలగించే పనిలో పాలు పంచుకున్నారు. నగర పాలక సంస్థ అధికా రులు కూడా చేయి కలిపారు దీంతో ఐ బి కాలనీ కల్వర్ట్ కు ఇరువైపులా పొదలు తొలగి పోయి శుభ్ర పడడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది , యంత్రాలు కాలువ లో సులువుగా పూడిక తొలగించడానికి అనుకూలంగా మార్గం ఏర్పడింది. శ్రమ దానంలో పంచుకున్న అందరినీ మేయర్ అభినందించారు. ఐ బి కాలనీ ప్రవేశంలో మూలన పేరుకుపోయిన శిధిలాలు చెత్త ను తొలగించారు. నీటి సరఫరా వాల్వ్ కోసం తవ్విన గుంత లపై ప్రమాదాలు జరగకుండా మూతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుటనే చెత్త ఉండడం గమనించి శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. కాలనీ ప్రవేశం లోనే మూల మలుపు వద్ద వృధా గా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల రోడ్డులో చైన్ జె సి బి యంత్రంతో పూడిక తీయడంతో మురుగు నీరు సాఫీగా ప్రవహిస్తున్నది. పూర్తి స్థాయిలో పని పవర్తయ్యేంతవరకు కొనసాగిం చాలని మేయర్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో నగర పాలక సంస్థ అధికారులు డి .ఇ.షాభా జ్ , ఎ ఇ మీర్ , టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , టి పి బి ఓ శ్రావణ్ , ఎలెక్ట్రికల్ ఎ ఇ రాంజీ , సానిటరి ఇన్స్పెక్టర్ నాగ భూషణం , జవాన్ బండారి రవి తదితరులు పాల్గొన్నారు.

## హామీల హంగామా.. పాలనలో పరాభవం

**చిలుకు నీరోష తీవ్ర విమర్శలు**



**ఆలేరు, విశాల భారతి**:ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో పూర్తిగా విఫలమైందని శారజీపేట వార్డు నెంబర్ సభ్యురాలు చిలుకు నీరోష తీవ్రంగా విమర్శించారు.శుక్రవారం ఆలేరు మండలంలోని షారాజీపేట గ్రామంలో ఆమె మాట్లాడారు.ఎన్నికల ముందు "తులం బంగారం" ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.బతుక మ్మ చీరలు అందరికీ అందలేదని, మహిళా సంఘాలకు రుణాలు ఇప్పటివరకు మంజూరు కాలేదని తెలిపారు.ఎన్నికల తరువాత ప్రజలకు మిగిలింది మౌనమే నని వ్యాఖ్యానించారు.రైతుల సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని, యువతకు ఉద్యోగావకాశాలు లేక నిరాశ పెరుగుతోందని పేర్కొన్నారు.మహిళలకు భద్రతా సహాయం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ అసలు స్వరూపం బయటపడిందని, ఈ పరిస్థితులను గమనిస్తున్న ప్రజలు త్వరలోనే గట్టి సమాధానం ఇస్తారని హెచ్చరించారు.

## రోడ్డుపై పడిన యువకుడు

**గోదావరిఖని పోలీసుల సహాయం**



**విశాలభారతి, గోదావరిఖని:** ఒక యువకుడు పవర్ హౌస్ కాలని గ్రంధాలయం ప్రాంతం లో తన స్కూటి నడిపే పరిస్థితిలేక అదుపు తప్పి రోడ్డు ప్రక్కన క్రింద పడిపోయి మొహం పై రక్తగాయాలు కావడం జరిగింది. రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి యువకున్ని గమనించి అతనిని లేపి వాటర్ అందించి అతని వివరాలు అడిగి తెలుసుకొని యువకుని స్నేహితునికి ఫోన్ చేసి పిలిపించి అతనిని అప్పగించి హాస్పిటల్ కి తీసుకువెళ్ళమని సూచించడం జరిగింది. తాత్కాలిక ఆనందాల కోసం యువత ప్రమదాలకు గురికావద్దు అని ప్రాణాలు కోల్పోయి, గాయాల పాలై తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు మానసిక క్షోభకి గురి చేయవద్దని, భవి ష్యత్తు నాశనం చేసుకోవద్దని సీఐ సూచించారు.

## ఉమెన్స్ కాలేజ్ గ్రౌండ్ 4,5 తేదీలో బిగ్ స్క్రీన్ పై ఐపీఎల్ మ్యాచ్లు




**నిజామాబాద్, విశాల భారతి:** ఐపీఎల్ క్రికెట్ అంటే ఇష్టపడని అభిమానులు ఉండరు. పట్టణాలలోని స్టేడియంలోకి వెళ్లి చూసి ఆనందించే అవకాశం తక్కువ మందికే ఉంటుంది. కానీ దేశవ్యాప్తం గా స్టేడియంలోకి వెళ్లి చూడాలని నిరాశ చెందే అభిమానుల కోసం దేశవ్యాప్తంగా 50 నగరాలలో ఈ ఐపిఎల్ ఫ్యాన్ పార్కులు ఏర్పాటు చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ వికాస్ పండిట్ తెలిపారు.జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ గురించి వివరించారు.జిల్లా కేంద్రంలో ఈ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేయడం ఇది నాలుగవసారి అని ఆయన తెలిపారు. ఎటువంటి రుసుము చెల్లించకుండా ప్రత్యక్ష అనుభూతిని పొంద వచ్చు అని తెలిపారు.ఈ ఫ్యాన్ పార్కులో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, కేవలం 100 రూపాయలకు తక్కువ ఛార్జీలు విధించబడతాయని తెలిపారు.ఇట్టి ఫ్యాన్ పార్క్ లో శని, ఆదివారాలలో జరిగే ఐపీఎల్ మ్యాచ్లు బిగ్ స్క్రీన్ పైన లైవ్ మ్యాచ్ లు చూపించబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, మేనేజర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లిలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్

**విశాలభారతి, రామగుండం:** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని క్యా తన్పల్లి మున్సిపాలిటీ పరిధిలో రేపు శనివారం 04042026 ఉదయం 06:00 గంటల నుండి చైర్ప ర్సన్ & వైస్ చైర్పర్సన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ఈ ఆంక్షల కాలంలో నలు గురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, అటవీ అధికారులు, కేంద్ర బలగాలు, హోమ్‌గార్డులు మరియు ఎస్‌పీఓలకు ఈ నిషేధాలు వర్తించవని స్పష్టం చేశారు.చట్టపరమైన అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తా రోకోలు, ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని, ఎవ్వరు కూడా కర్రలు, కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సం చరించడం పూర్తిగా నిషేధమని సీపీ తెలిపారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. 163 బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ అమలు సమయంలో చట్టబద్ధమైన అధికా రాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో, చట్ట ప్రకారం వారి మీద చర్యలు తీసుకోబడతాయి అని సీపీ తెలిపారు.

## దేశవ్యాప్తంగా పారాక్వాట్ నిషేధించాలి: డా. కవితా రెడ్డి



**నిజామాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో పారాక్వాట్ గడ్డి మందును నిషేధిస్తూ చట్టసభల్లో తీర్మానం చేయడం అభినందనీయమని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్పర్సన్, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ కవితా రెడ్డి తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఇదే విధంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కూడా పారాక్వాట్ గడ్డి మందును పూర్తిగా నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పారాక్వాట్ వాడకం వల్ల భూమి సారవంతత దెబ్బతినడంతో పాటు రైతుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దీని వినియోగం దీర్ఘకాలంలో పర్యావరణానికి, మనుషుల ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీలో పారాక్వాట్ గడ్డి మందు నిషేధానికి సంబంధించిన తీర్మానం ఆమోదించడం పట్ల ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి డాక్టర్ కవితా రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ఆరోగ్య పరిరక్షణకు ఇది కీలక నిర్ణయమని ఆమె అభిప్రాయపడ్డారు.

## కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**నిజామాబాద్, విశాలభారతి :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి, దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రభావశీలిగా నిలిచారని కొనియాడారు. ఆనాటి దేశముఖ్ ల అసంబద్ధ పాలనకు వ్యతిరేకం గా అత్యంత ధైర్య సాహసాలతో పోరాటం జరిపారని గుర్తు చేశారు. కొమురయ్య పోరాట స్ఫూర్తితో తెలం గాణాలో అనేక ప్రజాస్వామిక ఉద్యమాలు జరిగాయని, ఈ ఉద్యమాలకు దొడ్డి కొమురయ్య పోరు పటిమ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మహనీయుల కృషిని స్మరించుకునేందుకు, నేటి తరం వారిని ఆద ర్శంగా తీసుకుని ముందుకు సాగాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. మహనీయులు చూపిన బాటలో నడుస్తూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడడమే మనం వారికి అందించే నిజమైన నివాళి అని ఉద్బోధించారు. ఈ కార్య క్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి నర్సయ్య, వివిధ సంఘాల నాయకులు లక్ష్మణ్, దేవన్న, షేక్ హుస్సేన్, బంగారు సాయిలు, నరాల సుధాకర్, రాజేశ్వర్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జీసస్ లవ్ చర్చ్‌లో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు



**నిజామాబాద్, విశాలభారతి:** 18వ డివిజన్ ముబారక్ నగర్ జీసస్ లవ్ చర్చ్ లొ శుభశుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా దైవజనులు డాక్టర్ ఆనంద్ పాస్టర్ పాల్గొని మాట్లాడుతూ... యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు భక్తులకు తెలిపారు.. (1) మొదటి వాక్యం... తండ్రి వీరేమీ చేయుచున్నారో వీరే రుగరు గనుక వీరిని క్షమించు' లూక 23,24...(2) రెండోవ వాక్యం. నేడు నీవు నాతోకూడ పరదేసులో ఉందువు' లూకా 23,43.(3)మూడోవ వాక్యం ..అమ్మ యిదిగో నీ కుమారుడు యిదిగో నీ తల్లి" యోహాను 19,26.(4) నాలుగోవా వాక్యం..నా దేవా నా దేవా నన్ను ఎందుకు చెయ్యి విడిచితివి "మార్క్ 15,34.. (5) ఐదోవా వాక్యం.. నేను దప్పిగొనుచున్నును యోహాను 19,28.(6) ఆరోవ వాక్యం.. సమప్తమైనది " యోహాను 19,30.(7) ఏడోవ వాక్యం.. తండ్రి నీ చేతికి నా ఆత్మను అప్పగించు కొనుచున్నాను "లూక 23,46.యేసు క్రీస్తు గురించి ఏడు వాగ్దానాలు వివరించారు.క్రైస్తవులు చర్చిలో పలు గ్రామాల నుండి భారీగా మహిళలు. పెద్దలు.పిల్లలు. ప్రార్థనలు చేసినారు. ఏసుక్రీస్తు స్తుతిస్తూ భక్తి గీతాలు ఆలపించారు.జీసస్ లవ్ చర్చి డాక్టర్: పాస్టర్ ఆనంద్,దైవాజనురాలు రాణి ఆధ్వర్యంలో చర్చిలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి మందిరాల్లో విశ్వాసులకు మధ్యనా భోజనాన్ని నిర్వహించారు.

## అన్నదానం. ఒక పవిత్రమైన సమర్పణం



**కొడంగల్, విశాలభారతి:** దౌల్తాబాద్ మండలం లోని గుండేపల్లి వీరభద్రేశ్వర జాతర సందర్భంగా కాళికా దేవి ఆలయంలో అన్నదానం కార్యక్ర మం సోమవారం వద్ల నరహరి స్వామి గాయత్రి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సుఖశాంతులతో జీవించా లని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వద్ల నరహరి స్వామి కుటుంబ సభ్యులు భక్తులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.


## స్వర్ణగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర ఉత్సవాలు

**అభిషేకం, సుదర్శన హోమం, గోదాదేవి కల్యాణానికి భక్తులకు ఆహ్వానం**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కుంట్లూరు డివిజన్ పరిధిలోని గౌరెల్లి గుట్ట పై శ్రీశ్రీశ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీన రసింహస్వామి దేవాలయంలో స్వాతి నక్ష త్రాన్ని పురస్కరించుకుని నేడు ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు,ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి అభిషేకం, సుదర్శన హోమం అనంతరం శ్రీ గోదాదేవి కల్యాణం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి సమస్త గ్రామ ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు, యువకులు హాజరై స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్ తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు .

## ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తా



**19వ వార్డు కౌన్సిలర్ కల్లెంల జగపతి**

**మొయినాబాద్ విశాలభారతి:** మొయినా బాద్ మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ కల్లెంల జగపతి మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీను అమలు చేస్తానని కౌన్సిలర్ కల్లెంల జగపతి పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన తల్లి దీవెన పథకం ద్వారా వార్డులోని అర్హులైన ప్రతి ఆడబిడ్డ వివాహానికి రూ.41వేలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం నాడు 19వ వార్డుకు చెందిన వజ్రలింగం హేమలత దంపతుల కుమార్తె అయిన సింధూజ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన వంతు బాధ్యతగా రూ.41వేల రెండవ చెక్కును సింధూజ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కల్లెంల జగపతి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక హామీని అమలు పరుస్తానన్నారు. తల్లి దీవెన పథకం ద్వారా అర్హులైన ప్రతి ఆడబిడ్డ పెళ్లికి సొంత అన్నగా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్న రావిరాలలో ప్రజా పాలన గ్రామ సభ నిర్వహణ

**ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులపై చర్చ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చిన్న రావిరాల గ్రామపం చాయతీ ఆవరణంలో గ్రామ సభ నిర్వహించబడింది. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకృష్ణ గౌడ్ అధ్యక్షత వహించగా, స్పెషల్ ఆఫీసర్ పల్లవి , ఉప సర్పంచ్ శిరీష శంకర్ రెడ్డి హాజరయ్యారు. గ్రామ సభలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని పలు ముఖ్య అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్న బియ్యం వంటి ప్రజా సమస్యలు మరియు సంక్షేమ పథకాలపై వివరంగా చర్చించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన సూచనలు, అభిప్రాయాలు గ్రామస్తుల నుండి స్వీకరించారు. గ్రామ సభలో పాల్గొన్న గ్రామ పెద్దలు, మహిళలకు నిర్వాహకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## క్రీడల్లో జిల్లా ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేయాలి

- **క్రీడాకారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు**
- **సీఎం కప్ విజేతలకు అభినందన సభ**



**నిజామాబాద్, విశాలభారతి:**

సరిపడా సౌకర్యాలు లేనప్పటికీ క్రీడా రంగంలో నిజామాబాద్ జిల్లా అద్వితీయ ప్రతిభను కలిగి ఉండడం ఎంతో గర్వించదగ్గ విషయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ జిల్లాకు చెందిన హుస్సా ముద్దీన్, గుగులోత్ సౌమ్య, యెండల సౌందర్య, నిఖత్ జరీన్ వంటి ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ నిజామాబాద్ కు ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారని కొనియాడారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు ముందుకుసాగాల ని, నిజామాబాద్ జిల్లా ప్రతిష్టను మరింతగా ఇనుమ డింపజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీ డాకారులను ప్రోత్సహించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ - 2025 క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. వివిధ అంశాలలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ అభినందిస్తూ, వారికి మెడల్స్, బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నిజామాబాద్ జిల్లా వాసులైన అం తర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత హుస్సాముద్దీన్, భారత ఫుట్ బాల్ జట్టు కెప్టెన్ గుగులోత్ సౌమ్యలు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వీరిని ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డివైఎస్ఓ పవన్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగమణి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ బొబ్బిలి నర్సయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యా ర్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు




- **బీఆర్ఎస్ నేత జక్కిడి రఘువీర్ రెడ్డి నివాళి**
- **కురుమ సంఘ అభివృద్ధికి మద్దతు హామీ**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

తెలంగాణ రైతాంగ పోరాటాలకు ప్రాణం పోసిన అమరవీరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ఎల్బీనగర్ రింగ్ రోడ్డులో ఉన్న దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించా రు.అనంతరం కురుమ యువ చైతన్య సమితి ఆధ్వ ర్యంలో ఎస్కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కురుమ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భం గా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమం త్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కురుమ సంఘ అభివృద్ధి కోసం కోకాపేటలో సుమారు ₹500 కోట్ల విలువ గల 5 ఎకరాల భూమిని కేటాయించిన విష యాన్ని గుర్తుచేశారు. ఆ ప్రాంగణ అభివృద్ధి కోసం అవసరమైతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరా టానికి పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే కురుమ కుటుంబాలతో తనకు చిన్ననాటి నుండి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, కురుమ సోదరులు ఐక్యతతో ముందుకు సాగి విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ, ఎల్బీనగర్ నియోజకవర్గ కైస్ అధ్యక్షులు కుల్నే మల్లేశం కురుమ, సమితి సభ్యులు, కురుమ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో భూముల మోసం.. ఇద్దరు అరెస్ట్

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలం నార్సింగ్ పరిధిలో ఉన్న బృందావన్ కాలనీలో భూములపై పెద్ద ఎత్తున మోసం వెలుగుచూసిం ది. ఈ భూములకు సంబంధించి అర్బన్ ల్యాండ్ సీలింగ్ అథారిటీ మరియు లేట్ పి.వి. కుటుంబరా వు వారసుల మధ్య హైకోర్టులో పలు సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, కొంతమంది దుండగులు నకిలీ పత్రాలను సృష్టించి అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దుండగులు 1960-1970 దశాబ్దాల్లో భూములు అమ్మినట్లు తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేసి, వాటిని నిజమైనవిగా చూపిస్తూ బ్రోకర్లు, ఏజెంట్ల ద్వారా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తు న్నారని వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో 20 కేసులు నమోదు కాగా, సుమారు 30 మందిని అరెస్ట్ చేసి జ్యుడీషి యల్ రిమాండ్‌కు తరలించారు. తాజాగా మార్చి 2, 2026న బృందావన్ కాలనీలోని సర్వే నంబర్ 146లో ప్లాట్ నంబర్లు 30, 31, 32, 33లకు చెందిన సుమారు 2000 గజాల భూమిపై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి కబ్జా చేయడానికి యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. లేట్ అన్న పూర్ణమ్మ పేరుతో కూర రంగారెడ్డి కి భూమి అమ్మినట్లు తప్పుడు పత్రాలు సృష్టించినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, నకిలీ పత్రాల సృష్టిలో కీలకంగా ఉన్న కూర సమ్మోహన్ రెడ్డి, రాజేంద్ర చారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో ఇతర నిందితులపై కూడా దర్యాప్తు కొనసా గుతోందని తెలిపారు.

ప్రజలకు సూచనలు భూములు కొనుగోలు చేసే ముందు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, పూర్వపు లావాదే వీలు (లింక్ డాక్యుమెంట్లు) పూర్తిగా పరిశీలించాలి. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను సంప్రదించి పత్రాల నిజానిజాలు నిర్ధారించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పాత తేదీల (1960-1970) డాక్యు మెంట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తక్కువ ధరకు భూములు అమ్ముతున్నట్లు చెబితే అనుమానం వ్యక్తం చేయాలని సూచించారు. నకిలీ పత్రాలు గమనించినా లేదా మోసపోయినా వెంటనే నార్సింగి పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ జి. హరి కృష్ణ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ గోపీ దర్యాప్తు చేయగా, ఏసీపీ జి.వి. రమణ గౌడ్ పర్యవేక్షించారు.



# మన్సూరాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర ఘన విజయం

- 550కి పైగా బైక్‌లతో భారీ ర్యాలీ... ప్రముఖ నేతల పాల్గొనిక
- ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**





శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్‌లో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో సౌత్ ఎండ్ పార్క్ హనుమాన్ దేవాలయం నుంచి 550కు పైగా బైక్‌లతో ప్రారంభమైన భారీ ర్యాలీ డివిజన్ మొత్తం హనుమాన్ నామస్మరణతో మార్మోగించింది. ఈ సందర్భంగా మన్సూరాబాద్ చౌరస్తాలోని కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహారా ఎస్టేట్స్, ఎం.ఈ. రెడ్డి గార్డెన్స్, పనామా చౌరస్తా, రెడ్ ట్యాంక్ మార్గంగా ప్రయాణిస్తూ బి.ఎన్. రెడ్డి నగర్ చౌరస్తాకు చేరుకున్న ర్యాలీ, ఎల్‌బీనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భవ్య హనుమాన్ శోభాయాత్రలో కలిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, హనుమాన్ భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయానికి సహకరించిన కాలనీ సంఘాలు, ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామంలో కుస్తీ పోటీల నిర్వహణ



**విశాలభారతి, కోటగిరి / పోతంగల్ :** నిజాంబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోనీ కల్లూర్ గ్రామంలో కుస్తీ పోటీ నిర్వహణ రామ గౌడ్ ఆధ్వర్యంలో 10 రూపాయల నుండి 11 రూపాయల కుస్తీ పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో పలు గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామస్తులు కుస్తీ పోటీ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కల్లూరు గ్రామ సర్పంచ్ రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ మరియు మాజీ సర్పంచ్ లింగప్ప పటేల్, వార్డు సభ్యులు, పీరుగొండ మరియు వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెగడాపల్లి గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ జాతర, కుస్తీ పోటీలు

**విశాలభారతి, బోధన్ :** బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలను వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. వీడీసీ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు కలిసి ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుస్తీ పోటీలను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చివరి పోటీలో విజయం సాధించిన మల్లయోధుడికి రూ.5,000 నగదు బహుమతిని అందజేశారు. ఎల్లమ్మ మందిరం వద్ద జాతర ఏర్పాటుతో గ్రామం మొత్తం సందడిగా మారింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఆర్మీ జవాన్‌ను ఘన సన్మానించిన గ్రామస్తులు



**విశాలభారతి, బోథ్ :** బోథ్ మండలం కౌట బి గ్రామానికి చెందిన ఓరుగంటి సురేష్ గత 17 సంవత్సరాలు దేశ సేవ చేసి పదవి విరమణ పొంది స్వగ్రామానికి చేరుకున్నారు. ఈయన తన విధి నిర్వహణలో భాగంగా జమ్మూ కాశ్మీర్, బెంగుళూరు, సిక్కిం లతో పాటు ఐక్యరాజ్యసమితి తరుపున కాంగో దేశంలో సైతం విధులు నిర్వర్తించారు. కాగా పదవి విరమణ పొంది స్వగ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్థులు, స్నేహితులు, సైన్యంలో పనిచేసి పదవి విరమణ పొందిన వారు, ప్రస్తుతం సైన్యంలో, పోలీస్ శాఖ లో కొనసాగుతున్న గ్రామ యువత పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశానికి సేవే చేసే అవకాశం నాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టిన ఊరుకు, గ్రామస్తులకు తాను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని అన్నారు. గ్రామంలో యువత అధిక సంఖ్యలో దేశ సేవ కు సన్నాద్దం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణ రెడ్డి, విడిసి అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, విడిసి మాజీ అధ్యక్షుడు బి. శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## సంకా ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి

**విశాలభారతి, అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాద్ మాతృమూర్తి సంకా వరలక్ష్మి కొద్దిరోజుల క్రితం స్వర్గస్థులు అయ్యారు. అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎకనామిస్ట్ ఏనుగుల రాకేష్ రెడ్డి వరలక్ష్మి చిత్రపటానికి పులు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కాసాని నాగ శేష పద్మ చంద్ర మోహన్ నివాసానికి వారి ఆహ్వానం మీరు వెళ్ళి స్థానిక నాయకులతో కాసేపు ముచ్చటించారు. అలాగే బిఆర్ఎస్ నాయకులు జజ్జువరపు శ్రీరామ్ మూర్తి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే మెచ్చా తెచ్చిన పనులు తప్ప కొత్తగా తట్టెడు మట్టి కూడా పోసిన దాఖలాలు లేవని మాటలకే తప్ప చేతల్లో ఏం లేదని ఆర్టీవో కార్యాలయం గత ప్రభుత్వంలో తెస్తే నేడు అది మూత పడిన కనీసం పట్టించుకునే నాథుడు లేడని 100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి నోట 420 హామీల ఊసే లేదని గ్రామ సభలు కేవలం కాంగ్రెస్ పార్టీకి డప్పు కొట్టుకోవడానికి తప్ప ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదని కొంతమంది అధికారులు కూడా కాంగ్రెస్ కి వత్తాసు పలికే పరిస్థితికి వచ్చారని 2028 లో తిరిగి 100 స్పీడ్ లో కారు దూసుకు వస్తుందని ఆ స్పీడ్ కి హస్తం పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. ఘనంగా దొడ్డి కొమురయ్య 99వ జయంతి నిర్వహణ

## తెలంగాణ ఉద్యమ తొలి అమరుడి ఆశయాలు సాధించాలి : RSP జిల్లా కన్వీనర్ కటారి రాములు




**విశాలభారతి, నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని నందేవాడలో ఉన్న రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (RSP) జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా RSP జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. నిజాం పాలనలో భూమి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం, దొరల దోపిడీకి వ్యతిరేకంగా కొమురయ్య చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. రైతులు, పేదలు, కూలీలు తీవ్ర దోపిడీకి గురవుతున్న సమయంలో ప్రజలను చైతన్యపరుస్తూ నిరంకుశ పాలనకు ఎదురు నిలిచిన నేతగా ఆయన నిలిచారని తెలిపారు. "భూమి దున్నేవారికే భూమి" అనే నినాదంతో సాగిన పోరాటం తెలంగాణ ఉద్యమాన్ని మరింత బలపరిచిందన్నారు. కొమురయ్య త్యాగం రైతాంగ పోరాటాలకు దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా భూమి సమస్యలు, పేదల ఇబ్బందులు కొనసాగుతున్నాయని, కొమురయ్య ఆశయాలను సాధించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు పేదల భూములను రక్షిస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పిట్ల నరేశ్, బొడ అనిల్, మహమ్మద్ నిజాముద్దీన్, గోపాల్ సింగ్ ఠాకూర్, సునీల్, సూర్యపాల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిపై అక్రమ రిజిస్ట్రేషన్ ఆరోపణలు



- మునుగునూరులో ఉద్రిక్తత
- సీపీఎం నేతల ఆందోళన

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్మెట్ మండలం జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్ వార్డు మునుగునూరు గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై తీవ్ర ఆరోపణలు వెలువడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు సర్వే నంబర్ 38లో ఉన్న ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి, సర్వే నంబర్ 35కి చెందిన పాత ఆంధ్రప్రదేశ్ పాస్‌బుక్‌ను ఆధారంగా చూపుతూ 2025లో వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపిస్తున్నారు. తొర్రూర్‌కు చెందిన నల్లబోలు జంగారెడ్డి అనే వ్యక్తి బోల్గురి నర్సింహకు భూమిని విక్రయించినట్లు, అలాగే గతంలో ఉన్న లేఅవుట్‌ను మార్పులు చేసి కొత్తగా ప్లాట్లు సృష్టించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఏప్రిల్ 2న స్థానికులు అబ్దుల్లాపూర్మెట్ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయగా, అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మట్టిదిబ్బలు వేయించిన విషయంపై జంగారెడ్డిని ప్రశ్నించగా తానే వేసినట్లు ఒప్పుకుని తొలగిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, అనంతరం రాత్రి సమయంలో మరిన్ని లారీలతో మట్టిని పోయించినట్లు స్థానికులు ఆరోపించారు. దీనిపై సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వ భూమి రక్షణ కోసం ఆందోళన చేపట్టారు. అనంతరం కాలనీ అసోసియేషన్ నాయకులు హయత్నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు వెంటనే విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు, వెంకటేశ్వర కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి. కిషన్, మున్సిపల్ కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, పి. శ్రీనివాసులు, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి సాయి గౌడ్, కోశాధికారి కే. ఆంజనేయులు, కమిటీ సభ్యులు ఎం. బాలు నాయక్, ప్రదీప్, సైదులు, రవి, లింగారెడ్డి, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్నెస్ లేని డంపర్లను నిలిపివేసిన డిప్యూటీ డైరెక్టర్

**మైన్ సేఫ్టీ 100 కు పైన డంపర్లు.. కేవలం 35 మాత్రమే పిట్నెస్**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**



సింగరేణి మణుగూరు ఏరియా పీకే ఓసి సెక్షన్2 లో పనిచేస్తున్న విపిఆర్ దుర్గ (డీఐఎంపీఎల్) ఓబీ కంపెనీలో ఆదివారం జరిగిన ప్రమాద సంఘటన నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ దిలీప్ కుమార్ రక్షణ తనిఖీ చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో లో గుర్తించిన ఫిట్నెస్ సర్టిఫికెట్ మరియు అవసరమైన అనుమతులు లేని సుమారు వందకి పైగా సానీ డంపర్లను నిలిపివేశారు. గురువారం 2న సెకండ్ షిఫ్ట్ బ్లాస్టింగ్ తర్వాత మొత్తం వాహనాల్లో కేవలం 35 భారీ డంపర్ లకే ఫిట్నెస్ అనుమతులు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన ఫిట్నెస్ లేని వాహనాల పనులను పూర్తిగా పార్కింగ్ యార్డ్కే పరిమితం అయ్యేలా నిలిపివేశారు. ఈ ప్రమాద సంఘటన ఒక ఓబి వర్కర్ చనిపోయిన నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు, ప్రమాద సంఘటనలు పునారవృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అనుక్షణం కార్మికులను సూపర్వైజర్లను అప్రమత్తం చేయాలని, వ్యక్తిగత రక్షణ పరికరాల ధరింపు, పని స్థలాలలో రక్షణ చర్యలు, హాల్ రోడ్స్, లైటింగ్, వాటర్ స్ప్రేయింగ్ తదితర అంశాలలో ప్రమాదాలు నివారణకు చేపట్టవలసిన రక్షణ చర్యలకు సంబంధించి తగు సూచనలతో కూడిన ఆదేశాలు ఓబి యాజమాన్యానికి జారీ చేసినట్లు తెలిసింది, అలాగే పర్యవేక్షణకు సంబంధించి సింగరేణి యాజమాన్యానికి కూడా తగు ఆదేశాలు అనగా కోల్ మైన్స్ రెగ్యులేషన్ (సిఎంఆర్ 2017) నిబంధనల ప్రకారం రక్షణ సూత్రాలు పాటించాలని ప్రతిరోజు క్రమం తప్పకుండా సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ (యస్ యం పి) స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (యస్ ఓ పి) ప్రకారం గనిలో పనిలో గ్యారేజీలో అట్టి ఆదేశాలు అమలు చేయాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

## కేరళ గురించి రేవంత్ మాట్లాడడం సిగ్గుచేటు

**మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి**

**ఎల్బీనగర్ విశాలభారతి:**

కమ్యూనిస్టు ప్రభుత్వం అయిన కేరళ ముఖ్యమంత్రి విజయన్ గురించి తెలంగాణలో 6 గ్యారంటీలు అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడడం చాలా సిగ్గుచేటని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. శుక్రవారం మన్సూరాబాద్ లోని సహారా ఎస్టేట్స్ ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన కేరళ ప్రభుత్వంపై విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి నోరు అదుపులో ఉండాలని, ఆయన చెప్పినట్లుగానే కేరళ అఖిలపక్షాన్ని తెలంగాణలో తీసుకొచ్చి ఆరు గ్యారంటీల అమలు తీరుపై మాట్లాడేందుకు దమ్ముందా అని సవాల్ విసిరారు. కేరళ ప్రభుత్వం విద్యా, వైద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో, పంచాయతీరాజ్ వ్యవస్థలో అన్ని రంగాల్లో దేశానికి రోల్ మోడల్ గా కేరళ ఉండడంతోనే కరోనా సమయంలో ప్రజలకు అక్కడి ప్రభుత్వం అండదండగా ఉండడంతోనే రెండోసారి వామపక్ష పార్టీ అధికారంలోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో తెరాస ఎమ్మెల్యే లు కేరళ ను సందర్శించి వైద్యం విధానాన్ని తెలుసుకుని తెలంగాణ లో బస్తీ దావఖానా ను ఏర్పాటు చేశారని, విజయన్ అనుభవం అంత రేవంత్ రెడ్డి వయసు లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీ లో మహిళలకు 2500, వ్యవసాయ కూలీలకు 1200, కళ్యాణ లక్ష్మి కి తులం బంగారం, 1,16,000 అమలు అయ్యాయా, వృత్తి సంఘాలు రేవంత్ రాకతో నిర్వీర్యం అయ్యాయని మండి పడ్డారు. 6 ఆరు గ్యారెంటీ లపై ప్రజలు నిలదీస్తారని వాటిని పక్కదోవ పట్టించేందుకు ఎన్నికల వాగదానాలను పక్కకు పెట్టి కొత్త వాటిని తీసుకువచ్చి ప్రజల మధ్యపెడుతున్నారని కాంట్రాక్టు ఉద్యోగాలను ఉద్యోగస్తులను తొలగిస్తున్నారని మంత్రులు నియోజకవర్గం అవుతున్నారని మంత్రులు ఉన్న నియోజకవర్గాలకు నిధులు వస్తున్నాయని అసెంబ్లీలో అధికార పార్టీ ఎమ్మెల్యే చెప్పడం సిగ్గుచేటని అన్నారు.



## ప్రైవేట్ బస్సు బోల్తా



**నిజామాబాద్ , విశాలభారతి:** వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం మధ్యాహ్నం సమయంలో టీజీ 15 టి 7888 నెంబరు గల ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురి కావడం జరిగిందని డ్రైవర్ అజీమ్ అజాగ్రత్తగా అతివేగంగా నడపడం వలన బడా పహాడ్ లోని సిద్దాపూర్ అడివి ప్రాంతంలో ప్రమాదానికి గురి కావడం జరిగిందని వర్ని ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ బస్సులో 36 మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుండగా బస్సు బోల్తా పడడంతో 8 మందికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించడం జరిగిందని ఎస్సై తెలిపారు. డ్రైవర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## జై కురుమ నినాదాలతో మార్మోగిన మూటకోండూరు

**దొడ్డి కొమురయ్య 99వ జయంతి**



**మూటకోండూరు, విశాలభారతి :** జై కురుమ... జై జై కురుమ నినాదాలతో మూటకోండూరు గ్రామం మార్మోగింది. మన కురుమ ముద్దుబిడ్డ, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతిని పురస్కరించుకుని మూటకోండూరు కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కురుమ సంఘం అధ్యక్షుడు శ్రీ రేగు చంద్రయ్య కురుమ నేతృత్వంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన సేవలు, తెలంగాణ ఉద్యమంలో చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. యువత దొడ్డి కొమురయ్య ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ కురుమ సంఘం ఉపాధ్యక్షులు దయ్యాల పాండు, భూమాండ్ల పరుశురాములు, ప్రధాన కార్యదర్శి బాల్ద నర్సింహులు, కోశాధికారి బుగ్గ భాస్కర్, డైరెక్టర్లు రేగు ఐలయ్య, బుగ్గ రమేష్, ఎగ్గిడి రాజు, బాల్ద రాజు, మల్ల రమేష్, చీరాల మల్లేష్, వస్పరి శ్రీకాంత్, సభ్యులు భూమండ్ల శ్రీనివాస్, మోటే ఎల్లయ్య, బుగ్గ బాలరాజు, బుగ్గ సిద్ధులు, మల్ల గణేష్, భూమండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణులకు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పిలుపు

**నేడు ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని ఆహ్వానం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ నేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు జరిగిన రోజు నుండి గత 51 రోజులుగా కాంగ్రెస్ పార్టీ ఎన్నో విధాలుగా కుట్రలు, ఇబ్బందులు సృష్టించినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ధైర్యంగా, క్రమశిక్షణతో క్యాంపులో నిలబడి పార్టీ గౌరవాన్ని కాపాడినట్లు ఆయన పేర్కొన్నారు. నేడు శనివారం రోజు జరగబోయే చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి విభాగాల నేతలు, మహిళా నాయకులు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు తప్పనిసరిగా ఉదయం 9 గంటలకు ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి హాజరు పార్టీ బలం, ఐక్యతను ప్రతిబింబిస్తుందని, అందరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## జగన్నాధపురంలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి .. వివరాలు వెల్లడించిన రూరల్ ఎస్సై సురేష్**



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామపంచాయతీ పరిధిలో మెయిన్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గుర్రం దుర్గారావు 49 అక్కడికక్కడే మృతి చెందాడు. పాల్వంచ రూరల్ ఎస్సై బి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన గుర్రం దుర్గారావు తండ్రి పెద్ద స్వామి. గత కొంతకాలంగా కరకగూడెం గ్రామంలోని చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడని, శుక్రవారం జగన్నాధపురం పెద్దమ్మ గుడి ప్రాంతంలోని వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్ళుటకు రోడ్డు దాటుతుండగా ఒక్కసారిగా మృత్యు ముంచుకొచ్చినట్టుగా టిఎస్ 02 యుబి 1836 గల లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో రెండుకాళ్ళు నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందినట్లుగా తెలిపారు. ఈ సంఘటనపై స్థానికులు సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని 108లో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికితరలించి మృతుని బంధువులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ గటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు

## బండారు మహేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే జారే



**అశ్వారావుపేట, విశాలభారతి:** అశ్వారావుపేట నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు బండారు మహేష్ ఇటీవల హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆయనను మర్యాదపూర్వకంగా పరామర్శించారు. మహేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ, బండారు మహేష్ పార్టీకి ఎంతో సేవలందించిన నాయకుడని, ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇలాంటి సమయాల్లో ఒకరికి ఒకరు అండగా నిలవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మ రాంబాబు, అశ్వారావుపేట మండల యువజన నాయకులు జూపల్లి ప్రమోద్ బాబు, సిమకుర్తి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బూసి పండు రంగా, కోలా లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు. నాయకులు అందరూ కలిసి బండారు మహేష్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుకున్నారు.

## గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహణ

**లూకా 23:43 వచనంపై దైవజనుల ఆధ్యాత్మిక సందేశం.. శాంతి, సమాధానానికి పిలుపు**



**అశ్వారావుపేట, విశాలభారతి :** గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్వారిగూడెంలో త్రియేక దేవుని సహవాసం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి గ్రామం మరియు పరిసర ప్రాంతాల నుండి విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైవజనులు కిరణ్ కుమార్ కొత్తూరి ప్రసంగిస్తూ, బైబిలులోని లూకా 23:43 వచనాన్ని ప్రస్తావించారు. "నేడు నాతో కూడ పరదైసులో ఉండెదవు" అనే యేసుక్రీస్తు మాటలు ఆయన అపారమైన కృప, క్షమాగుణాన్ని తెలియజేస్తాయని వివరించారు. సిలువపై ఉండగానే పాపిగా ఉన్న దొంగను క్షమించి, అతనికి పరలోక రాజ్యాన్ని వాగ్దానం చేయడం ద్వారా యేసుక్రీస్తు ప్రేమ ఎంత గొప్పదో ఈ వచనం స్పష్టంగా తెలియజేస్తుందని పేర్కొన్నారు. మనిషి చేసిన పాపాలు ఎంత పెద్దవైనా, నిజమైన పశ్చాత్తాపంతో దేవుని వైపు తిరిగితే ఆయన క్షమించడానికి సిద్ధంగా ఉంటాడని, విశ్వాసం ద్వారా రక్షణ సిద్ధమవుతుందని ఈ వచనం మనకు బోధిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి మనిషి జీవితంలో మార్పు తీసుకురాగల శక్తి ఈ సందేశంలో ఉందని, దేవుని కృప అందరికీ అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రార్థన సమావేశంలో భక్తిగీతాలు, సిలువ ధ్యానం కార్యక్రమాలు నిర్వహించగా, విశ్వాసులు ఆధ్యాత్మిక భావోద్వేగంలో మునిగిపోయారు. యేసుక్రీస్తు శ్రమలు, బాధలను స్మరించుకుంటూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సమాధానం, నైతిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు.



# మళ్లీ నటించాలని ఉంది

సౌత్ సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా ఎదిగిన సంయుక్త మీనన్, తన నటనతో పాటు పాత్రల ఎంపికలోనూ ప్రత్యేకత చూపిస్తూ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, కథా బలమున్న సినిమాలను ఎంచుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మలయాళ సినిమా పాప్‌కార్న్ ద్వారా 2016లో సినీ ప్రయాణం ప్రారంభించిన సంయుక్త, అతి తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. టాలీవుడ్‌లో ఆమె ఎంట్రీ భీమ్లా నాయక్ సినిమాతో జరిగింది. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన నటించి మంచి గుర్తింపు సంపాదించారు.అనంతరం బింబిసార, సార్, విరూపాక్ష వంటి వరుస హిట్ చిత్రాలతో సంయుక్త స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఈ సినిమాల విజయాల తర్వాత ఆమెను టాలీవుడ్‌లో 'లక్కీ బ్యూటీ'గా పిలవడం ప్రారంభమైంది. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవడమే ఆమె సక్సెస్ రహస్యం అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో, ధనుష్ తో కలిసి పని చేసిన అనుభవాన్ని సంయుక్త గుర్తు చేసుకున్నారు. సార్ చిత్రంలో ఆయన సరసన నటించిన ఆమె, ధనుష్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. ధనుష్‌తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్లో చాలా తక్కువగా మాట్లాడతారు. కానీ కెమెరా ముందుకు వచ్చేసరికి తన పూర్తి శక్తిని చూపిస్తారు. ఒక స్క్రిప్ట్‌ను ఆయన ఎంచుకుంటే అందులో తప్పకుండా ప్రత్యేకత ఉంటుంది అని ఆమె పేర్కొన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.